బుధవారం
14-02-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 233
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

జయా బచ్చన్‌కు మళ్లీ అవకాశం

లక్నో: అఖిలేశ్ యాదవ్ నేతృత్వంలోని సమాజ్ వాది పార్టీ (ఎస్‌పీ) మంగళవారం ఉత్తరప్రదేశ్ రాజ్యసభకు తమ అభ్యర్థులను ప్రకటించింది. రామ్‌జీలాల్ సుమన్, జయాబచ్చన్, మాజీ ఐఏఎస్ అధికారి అలోక్ రంజన్‌లను నామినేట్ చేసింది. ప్రస్తుతం ఎంపీగా ఉన్న జయాబచ్చన్‌ను మరోసారి నామినేట్ చేయగా, అలోక్ రంజన్‌ను మొదటిసారి ఎంపిక చేసింది. రామ్‌జీ లాల్, జయా బచ్చన్, అలోక్ రంజన్ తమ పార్టీ తరపున రాజ్యసభ అభ్యర్థులని, వారు నేడు నామినేషన్లు సమర్పిస్తారని ఎస్‌పీ అధికార ప్రతినిధి రాజేంద్ర చౌదరి తెలిపారు. ఉత్తరప్రదేశ్ అసెంబ్లీలో 2017లో 47 మంది ఎమ్మెల్యేలుండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 108కి పెరిగింది.

కర్షకులపై కాఠిన్యం

'దిల్లీ చలో' భగ్నానికి బరితెగించిన కేంద్రం

- రైతుల్ని అడ్డుకున్న భద్రతా బలగాలు...తీవ్ర ఉద్రిక్తం
- బాష్పవాయువు, జల ఫిరంగుల ప్రయోగం
- యుద్ధభూమిని తలపించిన పంజాబ్, హరియాణా సరిహద్దులు
- వేలాదిగా తరలివచ్చిన రైతులు

కేంద్రంలోని మోదీ సర్కారు మెడలు వంచి నల్ల వ్యవసాయ చట్టాలు రద్దుచేయించిన రైతు సంఘాలు...తమ డిమాండ్ల సాధన కోసం మరోమారు కదం తొక్కాయి. పంటలకు కనీస మద్దతు ధరకు భరోసానిచ్చే చట్టం తీసుకువస్తామన్న హామీ సహా కేంద్ర ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించకపోవడం, డిమాండ్లు నెరవేర్చకపోవడంతో... అన్నదాతలు 'చలో దిల్లీ' పేరుతో హస్తిన బాట పట్టారు. పంజాబ్, హరియాణా రాష్ట్రాల నుంచి వేలాదిగా ట్రాక్టర్లతో బయలుదేరిన రైతులను సరిహద్దు ప్రాంతం శంభు వద్ద పోలీసులు, భద్రతా బలగాలు అడ్డుకున్నారు. అంతేకాదు దేశానికి అన్నం పెట్టే అన్నదాతలపై కర్కశంగా ప్రవర్తించారు. రోడ్డుకు అడ్డంగా పెట్టిన ముళ్ల కంచెలు, కాంక్రీటు దిమ్మెలు, మేకులను తొలిగించేందుకు రైతులు ప్రయత్నించారు. వారిపై బాష్పవాయు గోళాలు, జల ఫిరంగులతో భద్రతాబలగాలు విరుచుకుపడ్డాయి. రైతుల్ని పోలీసులు ఎక్కడికక్కడే నిలువరించారు. వెనక్కి తిరిగి వెళ్లిపోవాలని హుకుం జారీ చేయగా...తమ డిమాండ్లు నెరవేర్చే వరకు వెళ్లేదే లేదని రైతులు తేల్చి చెప్పారు. పోలీసులపై రాళ్లు రువ్వడంతో రాజధాని సరిహద్దు ప్రాంతం రణభూమిని తలపించింది. తమ డిమాండ్లు నెరవేరే వరకు కదలబోమని వేలాదిమంది రైతులు ముందుకు సాగారు. మరోవైపు, హడావుడిగా ఎంఎస్‌పీపై చట్టం చేయలేమని కేంద్రం మొండిగా చెప్పింది. ఇక ఇండియా కూటమి అధికారంలోకి వస్తే కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ప్రతిపక్షాలు సైతం రైతులకు మద్దతుగా నిలిచాయి. కాగా, పోలీసు నిర్బంధకాండ కారణంగా రైతులు తమ ఆందోళనను మంగళవారం రాత్రి నిలిపివేశారు. తిరిగి బుధవారం మొదలుపెడతామని ప్రకటించారు.

2 లో

రైతుల ప్రధాన డిమాండ్లు

- పంటలకు కనీస మద్దతు ధరకు హామీ ఇచ్చే చట్టం. ఇది రైతులకు కీలకమైన జీవనాధారం.
- విద్యుత్ సవరణ చట్టం 2020ని రద్దు చేయాలి
- లఖింపూర్ ఖేరీలో మృతి చెందిన రైతులకు వెంటనే పరిహారం అందించాలి.
- 2020లో రైతుల ఉద్యమంలో పాల్గొన్న వారిపై నమోదైన కేసుల్ని ఉపసంహరించాలి.
- స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలి.
- రైతులకు రుణమాఫీ చేయాలి.

రైతులపై కర్కశత్వం
ఆక్షేపణీయం
ఏఐటీయూసీ

8లో

బీజేపీకి రైతు ముప్పు

- ఎన్నికల వేళ భయాందోళన
- ఫలించని చర్చలు-దిగిరాని కేంద్రం

లోక్‌సభ ఎన్నికల కోసం వ్యూహాలను బీజేపీ సిద్ధం చేసుకొని ప్రణాళికాబద్ధంగా ముందుకెళుతోన్న సమయంలో రైతుల ఆందోళన రూపంలో ఆ పార్టీకి ఎదురు దెబ్బ తగిలింది. ఎన్నికల ముందు ఉద్యమానికి రైతులు సన్నద్ధం కావడంతో అధికార పార్టీ ఇరకాటంలో పడింది.

హామీల అమలు ఇంకెప్పుడు?

నెల దాటినా పట్టించుకోకపోవడం దారుణం
రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ధర్నాలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: గత నెల ప్రారంభంలో మున్సిపల్ కార్మికుల సమ్మెను పురస్కరించుకుని ప్రభుత్వం అంగీకరించిన డిమాండ్ల పరిష్కారానికి నెల దాటినా కనీస చర్యలు తీసుకోకపోవడాన్ని నిరసిస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్వర్యాన మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు చేపట్టారు. దీనిలో భాగంగా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన ధర్నాలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆసుల రంగనాయకులు, కడపలో నిర్వహించిన ధర్నాలో యూనియన్ ప్రధానకార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బరాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సరెండర్ లీవ్‌ల ఎన్‌క్యాష్‌మెంట్ విడుదల ఇంకెప్పుడు చేస్తారంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జనవరి 3 నుంచి 10 వరకు మున్సిపల్ కార్మికులు నిర్వహించిన సమ్మె అనంతరం... రాష్ట్ర ప్రభుత్వం జరిపిన చర్చల్లో కొన్ని డిమాండ్లు అంగీకరించింది. వాటిలో ముఖ్యంగా మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరించడానికి పదేళ్ల సీనియారిటీ ప్రాతిపదికన తీసుకొని కాంట్రాక్ట్ బేసిక్‌లోకి మళ్లించి వారిని రెగ్యులరైజ్ స్తామని చెప్పారు. అలాగే సరెండర్ లీవుల సొమ్ము గ్రీన్ ఛానల్‌లో ఉందని, కేవలం10 రోజుల్లో విడుదల చేస్తామని చెప్పారు. కానీ తాము సమ్మె విరమించి

- మిగతా 2 లో

పాక్‌లో సంకీర్ణం

- పార్టీల ముమ్మర కసరత్తు
- ఎంపీఎంతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం: పీటీఐ
- స్వతంత్రులు మెజారిటీ నిరూపించుకుంటే విపక్షంగా ఉంటాం: పీఎంఎల్-ఎన్
- నాల్గోసారి ప్రధానిగా నవాజ్ షరీఫ్ : షెహబాజ్

ఇస్లామాబాద్/లాహోర్: పాకిస్థాన్‌లో ఏ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. ఐక్యరాజ్య సమితితో పాటు ప్రపంచ దేశాలన్నీ ఈ దేశ పరిణామాలను నిశితంగా గమనిస్తున్నాయి. ఆర్థిక సంక్షోభంతో పాటు అనేక సమస్యల సుడిగుండంలో చిక్కుకున్న పాకిస్థాన్ భవిష్యత్ ఏమిటన్న ప్రశ్న సర్వత్రా వినిపిస్తోంది. అక్కడి పార్టీలు ఎవరికి వారు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తుండటం

- మిగతా 2 లో

జేఈఈలో తెలుగు విద్యార్థుల సత్తా

23 మందికి 100 శాతం మార్కులు

న్యూదిల్లీ: దేశంలోని ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లోని ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించిన జేఈఈ మెయిన్ 2024 సెషన్-1 ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఇందులో తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. ఎన్‌టీఏ విడుదల చేసిన పేపర్-1 (బీఈ/బీటెక్) ఫలితాల్లో దేశవ్యాప్తంగా 23 మంది విద్యార్థులు 100 శాతం మార్కులు సాధించారు. ఇందులో 10 మంది తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు ఉన్నారు. తెలంగాణకు చెందిన రిషి శేఖర్ శుక్లా, పబ్బ రోహన్ సాయి, ముతవరపు అనూప్, హుందేకర్ విదిత్, మదినేని వెంకట సాయితేజ, కల్లూరి శ్రియాషస్ మోహన్, తవ్వ దినేశ్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన షేక్ సూరజ్, తోట సాయి కార్తీక్, అన్నారెడ్డి వెంకట తనీశ్ రెడ్డి 100 శాతం స్కోరు సాధించారు. జనవరి 24 నుంచి ఫిబ్రవరి 1 వరకు నిర్వహించిన జేఈఈ మెయిన్ తొలి విడత పేపర్-1 పరీక్షకు దేశవ్యాప్తంగా 11,70,036 మంది విద్యార్థులు (95.8 శాతం) హాజరైన విషయం తెలిసిందే. చివరి విడత (సెషన్ 2) ఏప్రిల్ 4 నుంచి 15 మధ్య నిర్వహించనున్నట్లు ఎన్‌టీఏ ప్రకటించింది. తొలి విడత రాసిన విద్యార్థులు... రెండో విడతకు సైతం దరఖాస్తు చేసుకోవచ్చు. రెండింటిలో ఉత్తమ స్కోర్‌ను పరిగణనలోకి (రెండు విడతలు రాస్తే) తీసుకుంటారు.

నాప్కాబ్ డైరెక్టర్‌గా
చలసాని ఎన్నిక

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అర్బన్ బ్యాంకులు, క్రెడిట్ సొసైటీల జాతీయ సమాఖ్య (నాప్కాబ్-నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్స్ అండ్ క్రెడిట్ సొసైటీస్) డైరెక్టర్‌గా ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు ఎన్నికయ్యారు. న్యూదిల్లీలోని నేషనల్ కో-ఆపరేటివ్ యూనియన్ ఆడిటోరియంలో అత్యంత ఉత్కంఠభరితంగా జరిగిన ఎన్నికల్లో రాఘవేంద్రరావు 211 ఓట్లు సాధించారు. నాప్కాబ్‌కి మొత్తం వివిధ కేటగిరీల నుంచి 19 మంది డైరెక్టర్లు ఎన్నిక కావాల్సి ఉండగా, ఇప్పటికే 12 మంది ఏకగ్రీవమయ్యారు. అర్బన్ బ్యాంకులకు కేటాయించిన ఏడు స్థానాలకు ప్రత్యక్షంగా ఎన్నిక జరిగింది. జాతీయ సమాఖ్య మార్గదర్శకులు చైర్మన్ ఎమిరిటస్, కర్నాటక రాష్ట్ర న్యాయశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్, నాప్కాబ్ ప్రస్తుత అధ్యక్షుడు జ్యోతేంద్రభాయి మెహతా నాయకత్వంలో దేశంలో వివిధ రాష్ట్రాల

- మిగతా 2 లో

నాటో, విదేశీ స్థావరాలు వద్దు

- సైప్రస్ కమ్యూనిస్టుల ఆందోళన
- నికోసియాలో ఆందోళన
- పలస్తీనాకు సంఘీభావం
- యెమన్‌లో రక్తపాతానికి ఖండన

నికోసియా: దేశంలో నాటో, విదేశీ సైనిక స్థావరాలు వద్దని సైప్రస్ కమ్యూనిస్టులు డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌తో బ్రిటన్ హై కమిషన్ ఎదుట సైప్రస్ కమ్యూనిస్టు ఇనిషియేటివ్ (సీసీఐ) అధ్వర్యంలో భారీ ఆందోళన నిర్వహించారు. పెద్ద సంఖ్యలో కమ్యూనిస్టులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు. పలస్తీనియా ప్రజలకు వ్యతిరేకంగా ఇజ్రాయిల్ మారణహోమం, యుద్ధ నేరాలను నిరసనకారులు తీవ్రంగా ఆక్షేపించారు. యెమన్‌లో రక్తపతాన్ని ఖండించారు. బ్రిటిష్ స్థావరాల ద్వారా సైప్రస్ కూడా మారణహోమంలో భాగస్వామి కావడాన్ని వ్యతిరేకించారు. ఇలాంటి పరిణామాలతో ప్రభుత్వానికి మరిన్ని క్లిష్ట పరిస్థితులు ఎదురువుతున్నట్లు వెల్లడించారు. ఎర్ర సముద్రంలో ఈయూ సైనిక చర్యల్లో సైప్రస్ పాల్గొనడాన్ని ఖండించారు. ర్యాలీలో సీసీఐ ఎగ్జిక్యూటివ్ కార్యదర్శి క్రిస్టోస్ కౌర్టోల్లారిస్ మాట్లాడుతూ మన దేశం నుంచి నాటో, ఈయూ దళాలను ఉపసంహరించేంత వరకు, విదేశీ సైనిక స్థావరాలను తొలగించేంత వరకు పోరాడదామని పిలుపునిచ్చారు. బ్రిటిష్ సైనిక స్థావరాలకు వ్యతిరేకంగా పోరు సాగిస్తున్నట్లు తెలిపారు. బ్రిటిష్ స్థావరాలు తమ దేశానికి సిగ్గు చేటన్నారు. తమ దేశం ఓ పర్యవేక్షణ కేంద్రంగా మారిందని, రక్తపాతాన్ని కొనసాగించేందుకు కేంద్రంగా ఉన్నదని దుయ్యబట్టారు.

బ్రిటిష్ స్థావరాల మూసివేతకు డిమాండ్ చేశారు. పలస్తీనియన్లకు సంఘీభావం ప్రకటించారు. టర్కీ ఆక్రమిత భూభాగాల్లో సైనికీకరణపై ప్రభుత్వ మౌనాన్ని ప్రశ్నించారు. హంతకులకు భూమి, గాలీ, నీరు అందరాదని నిరసనకారులు నినదించారు. పెత్తందారీ విధానాలతో ముడి పెట్టుకొంటే ఎవరూ విజయం సాధించలేరన్నారు. సైప్రస్ దీర్ఘకాలిక సమస్య విషయంలో బ్రిటిష్ హై కమిషన్ కవ్వింపులను ఆక్షేపించారు. తక్షణమే విదేశీ సైనిక స్థావరాలను మూసివేయాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ ఏర్పాటుపై పీటీఐ ప్రత్యేక కమిటీల కసరత్తు

- అభ్యర్థుల 30 పిటిషన్లు కొట్టివేసిన లాహోర్ హైకోర్టు
- రిగ్గింగ్, సమస్యల పరిష్కారానికి ఈసీపీని ఆశ్రయించాలని సూచన

ఇస్లామాబాద్: పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు చెందిన పీటీఐ పార్టీ ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మెజారిటీ స్థానాలను గెలుచుకున్నట్లు ప్రకటించుకుంది. కేంద్రంతో పాటు పంజాబ్, ఖైబర్ పంఖ్తుఖ్వా ప్రావిన్స్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు సిద్ధమైంది. ఇందుకోసం ప్రణాళికలు రూపొందించుకునేందుకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసుకుంది. ఈ కమిటీలు చేసే సిఫార్సులు, సూచించే వ్యూహాల ఆధారంగా కీలక ప్రభుత్వ, పార్లమెంటు పదవుల నామినేషన్ల ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని కోర్ కమిటీ భేటీలో పార్టీ నిర్ణయించింది. క్రిమినల్ నేపథ్యం ఉన్న వ్యక్తుల చేతుల్లోకి పరిపాలనను వెళ్లనివ్వబోమని పీటీఐ ప్రకటన తేల్చిచెప్పింది. ఇదిలావుంటే ఎన్నికల్లో ఓడిపోయిన పీటీఐ అభ్యర్థులు... ఫలితాలను న్యాయస్థానాల్లో సవాల్ చేశారు. ఈ మేరకు దాఖలైన 30 పిటిషన్లను పాకిస్థాన్ కోర్టు మంగళవారం కొట్టివేసింది.

పీఎంఎల్-ఎన్ నాయకులు నవాజ్ షరీఫ్, మరియం నవాజ్ విజయంపై పీటీఐ మద్దతున్న స్వతంత్ర అభ్యర్థులు కోర్టుకు వెళ్లారు. లాహోర్ కోర్టు వీరి పిటిషన్లను కొట్టివేసింది. ఓట్ల రిగ్గింగ్‌తో సహా సమస్యల పరిష్కారానికి పాకిస్థాన్ ఎన్నికల కమిషన్ (ఈసీపీ)ని ఆశ్రయించాలని న్యాయమూర్తి అలీ బకర్ నజాఫీ సూచించారు. పిటిషన్లను కొట్టివేశారు. పీటీఐ తరఫు సీనియర్ న్యాయవాది సర్దార్ లతీఫ్ ఖోసా వాదనలు వినిపించారు. తమ పార్టీ నేషనల్ అసెంబ్లీలో 170 స్థానాలు గెలుచుకుందని, ఫలితాల రిగ్గింగ్ జరిగిందని ఆరోపించారు. ఇస్లామాబాద్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయకుండా తమ ప్రభుత్వాన్ని అడ్డుకునేందుకు 80 ఎన్ఏ స్థానాల ఫలితాలను తారుమారు చేశారని, చరిత్రాత్మకంగా రిగ్గింగ్ జరిగిందని వ్యాఖ్యానించారు. తమ నుంచి లాక్కున్న స్థానాలను తిరిగి దక్కించుకునేందుకు పీటీఐ న్యాయ పోరాటానికి సిద్ధంగా ఉందన్నారు. కాగా, దేశంలో కీలుబొమ్మ పాలన ఏర్పాటు చేసేందుకు సంస్థాగతంగా రిగ్గింగ్ జరిగినట్లు పీటీఐ ఆరోపించింది.

గాజాలో ఇజ్రాయిల్ దాడులు ఆగకపోతే

మానవతా విపత్తు తప్పదు: చైనా

బీజింగ్: గాజాలో ఇజ్రాయిల్ వైఖరి మారకుంటే మానవతా విపత్తు తప్పబోదని చైనా హెచ్చరించింది. పలస్తీనియన్లపై దాడులను తక్షణమే నిలిపివేయాలని, పౌరులకు హాని కలిగించవద్దని, అంతర్జాతీయ చట్టాలను అతిక్రమించవద్దని ఇజ్రాయిల్‌కు సూచించింది. గాజాలో ఇజ్రాయిల్ భూతల, వైమానిక దాడులను మరింతగా విస్తరిస్తుండటంపై విదేశాంగ శాఖ ఒక ప్రకటన చేసింది. దాడులు ఆపకపోతే మానవతా విపత్తు ఏర్పడుతుందని తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తం చేసింది. ప్రాణనష్టాన్ని నివారించడానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించింది.

రఫాలో ప్రతిదాడులకు సిద్ధమవుతున్న హమాస్‌తో కాల్పుల విరమణకు ఒప్పందం కుదుర్చుకోవాలని ఇజ్రాయిల్‌పై అంతర్జాతీయంగా ఒత్తిడి పెరుగుతోంది. వారం కిందట సంధి కోసం హమాస్ పెట్టిన నిబంధనలను తిరస్కరించిన ఇజ్రాయిల్ రఫాలో దాడులు చేస్తోంది. ఇందులో ఇద్దరు బందీలను విడిపించింది. దాడుల్లో 100 మంది ప్రాణాలు కోల్పోయారు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ రఫాపై జరిగిన దాడులను తీవ్రంగా ఆక్షేపించారు.

చలసాని ఎన్నిక

(మొదటిపేజీ తరువాయి)

ఫెడరేషన్ల మద్దతుతో 'సహకార్ సే సమృద్ధి 24' ప్యానల్ నుంచి ఏడుగురు అభ్యర్థులు పోటీ చేశారు. వారిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి చలసాని రాఘవేంద్రరావు అత్యధికంగా 211 ఓట్లతో గెలుపొందారు. చలసానితోపాటు ఇదే ప్యానల్ నుంచి పోటీ చేసిన కర్నాటక రాష్ట్ర మాజీమంత్రి, అజాద్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్, ఏఎం హిందాస్ గిరి, ది కాస్మోస్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్, సీఏ మిలింద్ కాలే (మహారాష్ట్ర), బార్డోలీ నాగ్రిక్ సహకారి బ్యాంక్ చైర్మన్ గౌతమ్ బాయ్ వ్యాస్ (గుజరాత్), అకోలా జనతా కమర్షియల్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ జియాన్ చంద్ గార్గ్ (మహారాష్ట్ర), ప్రస్తుత నాఫ్కాబ్ డైరెక్టర్ కె.కాలప్ప (కర్నాటక), వర్చ కో-ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ కంజీభాయ్ బలాలా (గుజరాత్) నూతన డైరెక్టర్లుగా ఎన్నికయ్యారు.

పోలింగ్‌లో గుజరాత్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, కేరళ, హరియాణా, ఢిల్లీ తదితర రాష్ట్రాల నుంచి 230 ఓట్లు పోలవ్వగా, 8 ఓట్లు చెల్లలేదు. గెలుపొందిన ఏడుగురు డైరెక్టర్లలో జియాన్ చంద్ గార్గ్ 212 ఓట్లు సాధించి మొదటి స్థానంలో నిలవగా, రాఘవేంద్రరావు 211 ఓట్లతో ద్వితీయ స్థానంలో నిలిచారు. దేశంలోని సుమారు 1500కు పైగా అర్బన్ సహకార బ్యాంకుల్లో వివిధ విభాగాల్లో మొదటి 20 స్థానాల్లో నిలిచిన విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ ప్రతినిధికి డైరెక్టర్ స్థానం ఇవ్వాలన్న నాఫ్కాబ్ పెద్దల సమష్టి ఆలోచనలతో చలసాని ఎన్నికయ్యారు. ఈ పదవిలో ఆయన ఐదేళ్లు కొనసాగనున్నారు.

కృష్ణాజిల్లా నూజివీడు మండలం వెంకటాద్రిపురం గ్రామానికి చెందిన చలసాని రాఘవేంద్రరావు ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్స్ టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులుగా, ది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్స్ అండ్ క్రెడిట్ సొసైటీ ఫెడరేషన్ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. మాజీ శాసనసభ్యులు, ప్రముఖ కమ్యూనిస్టు నేత మానం ఆంజనేయులు 1983లో ది విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి బ్యాంకు పురోభివృద్ధికి చలసాని కృషి చేస్తున్నారు. 1993లో తొలిసారి బ్యాంకు డైరెక్టర్‌గా ఎన్నికైన ఆయన 2006 నుంచి 2013 వరకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గానూ సేవలందించారు. మానం ఆంజనేయులు 2013లో చైర్మన్ బాధ్యతల నుంచి స్వచ్ఛందంగా వైదొలగడంతో 20 ఏళ్లపాటు బ్యాంకు డైరెక్టర్‌గా కొనసాగిన చలసాని రాఘవేంద్రరావు చైర్మన్ బాధ్యతలు చేపట్టారు. 30 ఏళ్లపాటు చైర్మన్‌గా కొనసాగిన మానం ఆంజనేయులు సారథ్యంలో బ్యాంకు ఆర్థిక లావాదేవీలు కోటి రూపాయల నుంచి రూ.3,169 కోట్లకు చేరగా, చలసాని రాఘవేంద్రరావు హయాంలో రూ.7,263.66 కోట్ల ఆర్థిక కార్యకలాపాలతో దక్షిణ భారతదేశంలో అతిపెద్ద సహకార అర్బన్ బ్యాంక్‌గా ఆవిర్భవించింది. రాఘవేంద్రరావును తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన సహకార వేత్తలు అభినందనలతో ముంచెత్తారు.

చలసాని రాఘవేంద్రరావు తండ్రి జగన్నాథరావు కృష్ణాజిల్లా భారత కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు. వీరి కుటుంబం జాతీయ ఉద్యమం నుండి కమ్యూనిస్టు పార్టీలోకి వచ్చి నాటి నుండి కమ్యూనిస్టు ఆదర్శాలకు అనుగుణంగా పనిచేస్తున్నారు. వీరి సోదరులు చలసాని వెంకట రామారావు కార్మిక రంగంలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్నారు. రాఘవేంద్రరావు సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడిగా ఉన్నారు. విశాఖ నగర కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శిగా, జిల్లా సహాయ కార్యదర్శిగా ఆయన గతంలో పనిచేశారు. నూజివీడు ఎస్ఆర్ఆర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో, కంభంపాడు హైస్కూల్‌లో పదవ తరగతి వరకు చదువుకున్నారు.

అనంతరం ఏలూరులో ఐటీఐ కోర్సు పూర్తి చేసి విశాఖపట్నం హిందుస్థాన్ జింక్ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేశారు. ఆ సందర్భంలో జింక్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా కార్మిక రంగంలో విశేష కృషి చేశారు. విశాఖపట్నంలో అనేక కార్మిక సంఘాల నిర్మాణంలో క్రియాశీలక పాత్ర పోషించారు.

పాక్‌లో సంకీర్ణం

(మొదటిపేజీ తరువాయి)

చర్చనీయాంశమైంది. ఈ పరిస్థితుల్లో సంకీర్ణం ఏర్పడుతుందా లేక స్వతంత్రులు కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారా అన్న ప్రశ్న తెరపైకొచ్చింది. దీంతో రాజకీయ అనిశ్చితి, అస్పష్టత నెలకొన్నాయి. అయితే ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత అతిపెద్ద పార్టీగా పీఎంఎల్-ఎన్ ఆవిర్భవించినట్లు ఎన్నిక సంఘం ప్రకటించింది కానీ రిగ్గింగ్ జరిగిందని పీటీఐ తీవ్రంగా ఆరోపించింది. 'మెజారిటీ సాధించాం కాబట్టి మేమే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం. కేంద్రంలోనే కాకుండా పంజాబ్‌లోనూ' అంటూ పీటీఐ ప్రకటించింది. మజ్లిస్ వహదత్ ఏ ముస్లిమీన్ (ఎంవీఎం) పార్టీతో కలిసి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని పీటీఐ అధికార ప్రతినిధి రౌఫ్ హసన్ మంగళవారం ప్రకటించారు. ఇస్లామాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీటీఐ వ్యవస్థాపకుడు ఇమ్రాన్ ఖాన్ ఆమోదంతోనే ఎంవీఎంతో అవగాహన కుదిరినట్లు తెలిపారు. ఖైబర్ పఖ్తుంఖ్వాలో రిజర్వ్‌డ్ స్థానాల కోసం జమాత్ ఏ ఇస్లామీతో పొత్తు పెట్టుకుంటున్నట్లు చెప్పారు. ఎవరు గెలిస్తే వారే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలి... అది వారి హక్కు అని ఇమ్రాన్ ఖాన్ సందేశమిచ్చారని హసన్ అన్నారు. ప్రక్రియను ప్రభావితం చేయాలని చూసే వారు ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. పీఎంఎల్-ఎన్ లేక పీపీపీని తమ పొత్తు ప్రసక్తేల లేదని, ఆ పార్టీలంటే తమకు గిట్టదని పీటీఐ అధ్యక్షుడు గోహర్ అలీ ఖాన్ తేల్చిచెప్పారు. ఆ రెండు పార్టీలతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం కంటే ప్రతిపక్షంగా ఉండటం ఎంతో మేలన్నారు. మెజారిటీ ఉంది కాబట్టి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని అలీ ఖాన్ తెలిపారు. పీటీఐ నాయకుల వ్యాఖ్యలపై పీఎంఎల్-ఎన్ అధ్యక్షుడు షెహబాజ్ షరీఫ్ స్పందించారు. లాహోర్‌లో విలేకరుల సమావేశాన్ని నిర్వహించి తమది అతిపెద్ద పార్టీ అని ప్రకటించారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని స్వతంత్ర అభ్యర్థులు భావిస్తే అభ్యంతరం లేదని, తాము ప్రతిపక్ష పార్టీగా ఉంటామని అన్నారు. 'గెలిచిన స్వతంత్ర అభ్యర్థుల సంఖ్య ఎక్కువగానే ఉందన్నది వాస్తవం. దీనిని తిరస్కరించలేం కానీ పార్టీల్లో పీఎంఎల్-ఎన్ నంబర్ వన్‌గా ఉంది. ఆ తర్వాత స్థానంలో పీపీపీ నిలిచింది. ఫలితాలు వచ్చాయి కాబట్టి కొత్త దశలోకి అడుగుపెట్టాల్సిన సమయం ఆశన్నమైంది. పీటీఐ లేక పీటీఐ యేతరుల మద్దతున్న స్వతంత్రులు ఒకవేళ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని భావిస్తే అధ్యక్షుడి నుంచి ఆహ్వానం అందదు. మెజారిటీని నిరూపించుకొని ప్రభుత్వం ఏర్పాటు చేయగలిగితే సరే... అభ్యంతరం లేదు. రాజ్యాంగబద్ధ పాత్ర పోషిస్తూ ప్రతిపక్షంగా వ్యవహరిస్తాం. అలా జరగని పక్షంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే హక్కు ఇతర పార్టీలకు ఉంది. న్యాయబద్ధ, ప్రజాస్వామ్యబద్ధమైన పద్ధతి ప్రకారం ప్రభుత్వం ఏర్పాటు దిశగా ముందుకెళ్లి తదుపరి దశను ఖరారు చేసుకోవాల్సిన అవసరం ఉంటుంది. రాజకీయ పక్షాలు తమ విభేదాలను మర్చి... సవాళ్లను అధిగమించేందుకు కలిసి రావాలి' అని షెహబాజ్ అన్నారు. పాకిస్థాన్ ముస్లిం లీగ్ నవాజ్ (పీఎంఎల్-ఎన్) అధ్యక్షుడు నవాజ్ షరీఫ్ దేశానికి నాల్గోసారి ప్రధాని అవుతారని దీమాగా చెప్పారు. ప్రధాని పగ్గాలను నవాజ్ చేపడతారన్న మాటలకు కట్టుబడి ఉన్నానన్నారు. 'రిగ్గింగ్ ఆరోపణలు రాని ఎన్నికలు ఏమైనా ఉన్నాయా? ఖైబర్ ఫక్తుంఖ్వాలో స్వతంత్రులు మెజారిటీ సాధించారు. అంటే అక్కడ రిగ్గింగ్ జరినట్టా? సింధ్, బలోచిస్థాన్‌లో స్వతంత్రలు ఎవరూ గెలవలేదు. 2018లో మా పార్టీ ఓడిపోయినప్పుడు నల్ల బ్యాండ్లతో పార్లమెంటుకు వెళ్లామే తప్ప ఎవరినీ నిందించలేదు, ధర్నాలు చేయలేదు (పీటీఐ నిరసనలనుద్దేశించి). స్వతంత్రులు గెలుస్తున్నారు... పార్టీలు ఓడిపోతున్నాయన్న ప్రచారం తగదు' అని షెహబాజ్ అన్నారు. అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్)తో కొత్త ఒప్పందంపై ప్రశ్నకు 'నిస్సందేహంగా' అంటూ ఆయన బదులిచ్చారు. దేశ ఆర్థిక స్థితి దృష్ట్యా ఐఎంఎఫ్ ప్యాకేజి అనివార్యమన్నారు.

పీఎంఎల్-ఎన్‌లోకి నేతల ఫిరాయింపులపై ప్రశ్నకు అందులో తప్పేముందని షెహబాజ్ ప్రశ్నించారు. ఎన్నికల ప్రచారమప్పుడు తమ పార్టీపై పీటీఐ తీవ్రస్థాయిలో విమర్శించినప్పటికీ పీటీఐ మద్దతున్న స్వతంత్రులు కోరుకుంటే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఇవ్వాలని నవాజ్ షరీఫ్ అన్నారని చెప్పారు. మేము మా పాతాన్ని నేర్చుకున్నామని ప్రపంచానికి తెలియజేయాలి... ఇక్బాల్, క్వైద్ ఆకాంక్షించిన పాకిస్థాన్‌ను నిర్మించుకోవాలి అని షెహబాజ్ అన్నారు.

రాష్ట్రం నుంచి తరిమేస్తాం: బైరెన్‌సింగ్

ఇంఫాల్: మణిపూర్ ముఖ్యమంత్రి బైరెన్ సింగ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 1961 తర్వాత మణిపూర్‌కి వచ్చి స్థిరపడిన వారిని గుర్తించి, రాష్ట్రం నుంచి బహిష్కరిస్తామని చెప్పారు. కులం, కమ్యూనిటీని పట్టించుకోకుండా... 1961 తర్వాత రాష్ట్రానికి వచ్చిన వాళ్లందరినీ వెనక్కు తిరిగి పంపిస్తామని ఉద్ఘాటించారు. మణిపూర్‌కు చెందిన తెగల ఉనికిని కాపాడేందుకే ఈ చర్యలు చేపడుతున్నామని స్పష్టం చేశారు. డ్రగ్ మాఫికా, అక్రమ వలసదారులు, ముఖ్యంగా మైన్మార్ నుంచి వచ్చిన శరణార్థుల కారణంగానే మణిపూర్‌లో హింస, అల్లర్లు చెలరేగాయని ఆరోపించారు. రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా... వలసదారుల్ని తిప్పి పంపించాలన్న నిర్ణయం తీసుకున్నామన్నారు. ఇంఫాల్‌లో నిర్వహించిన స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం తాము అత్యంత కష్టకాలంలో ఉన్నామని, ఇప్పుడు ఉనికి, మనుగడ, గుర్తింపు కోసం పోరాటం జరుగుతోందని ముఖ్యమంత్రి అన్నారు. ఇలాంటి దుర్భర పరిస్థితుల్లోనూ మనం జీవించాలి, మనుగడ కొనసాగించాలన్నారు. ఇక నుంచి భారత్, మైన్మార్ మధ్య ఫ్రీ మూమెంట్ రిజైమ్ (ఎఫ్ఎంఆర్) ఉండదని, రెండు దేశాల మధ్య కంచె నిర్మిస్తామన్నారు. ఈ తరం ఎదుర్కొంటున్న అభద్రతాభావం భవిష్యత్తు తరాలకు ఉండకూడదన్నారు.

కర్షకులపై కాఠిన్యం

న్యూఢిల్లీ:

అన్నదాతలపై మోదీ సర్కారు కన్నెర్ర చేసింది. రైతుల ఢిల్లీ చలో భగ్నానికి బరితెగించింది. పంజాబ్, హరియాణా తదితర రాష్ట్రాల నుంచి వచ్చే కర్షకులను ఎక్కడికక్కడ అడ్డుకున్నది. కేంద్రబలగాలతో పాటు పెద్దఎత్తున పోలీసులను మోహరించింది. సరిహద్దులన్నీ మూసివేసింది. వ్యవసాయ చట్టాల ఉపసంహరణ సమయంలో కనీస మద్దతు ధర కోసం చట్టం తీసుకువస్తామన్న హామీ సహా వివిధ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చిన 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని భగ్నం చేసేందుకు కేంద్రం పెద్ద ఎత్తున భద్రతా బలగాలను రంగంలోకి దించడంతో మంగళవారం ఢిల్లీ సరిహద్దులు యుద్ధభూమిని తలపించాయి. వివిధ రైతు సంఘాల నేతృత్వంలో పెద్ద సంఖ్యలో దేశ రాజధాని ఢిల్లీకి బయలుదేరిన రైతులను హరియాణా, పంజాబ్ సరిహద్దు ప్రాంతం శంభు వద్ద నుంచి ముందుకు కదలకుండా పోలీసులు, భద్రతా బలగాలు అడ్డుకున్నాయి. ముళ్ల కంచెలు, కాంక్రీటు దిమ్మెలు, మేకులతో రోడ్డుకు అడ్డుగా పోలీసులు పెట్టిన ఆటంకాలను తొలిగించేందుకు రైతులు ప్రయత్నించారు. బారికేడ్లను ట్రాక్టర్లతో తొలిగించేందుకు యత్నించగా పోలీసులు బాష్పవాయు గోళాలు, జల ఫిరంగులను ప్రయోగించారు. బాష్పవాయు గోళాలతో పెద్ద ఎత్తున పొగలు అలుముకోవడంతో రైతులు పరుగులు పెట్టారు. ఈ పరిణామాలతో శంభు సరిహద్దులు రణరంగాన్ని తలపించాయి.

భారీసంఖ్యలో ట్రాక్టర్లు, ఇతర వాహనాలలో శంభు సరిహద్దుకు చేరుకున్న రైతులు... అడ్డుగా నిలిచిన పోలీసులపై రాళ్లు రువ్వారు. వారిని చెదరగొట్టేందుకు పోలీసులు డ్రోన్ల ద్వారా బాష్ప వాయుగోళాలు జార విడిచారు. అయినా సరే బెదరకుండా ముందుకు వెళ్లేందుకు రైతులు ప్రయత్నాలు కొనసాగించారు. శంభు వద్ద వంతెనకు రక్షణగా పెట్టిన రేకులను ధ్వంసం చేసి కిందపడేశారు. మరింత ముందుకు దూసుకెళ్లేందుకు యత్నించిన కర్షకులపై పోలీసులు జలఫిరంగులను ప్రయోగించారు. అయినప్పటికీ శంభు సరిహద్దు వద్ద రైతులకు, పోలీసులకు మధ్య ప్రతిఘటన జరుగుతోంది. మరోవైపు రైతులు తమ ఇంటి వద్ద నుంచి తెచ్చుకున్న ఆహారాన్ని వడ్డించుకుని రోడ్డుపైనే తిన్నారు.

రైతుల అరెస్టులు

రోడ్డు మార్గం ద్వారా కాకుండా పక్కనే ఉన్న పొలాల మీదుగా ముందుకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న కొందరు రైతులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హరియాణాలోని జింద్ వద్ద కూడా కర్షకులు ముందుకు వెళ్లకుండా పోలీసు, పారామిలటరీ బలగాలు అడ్డుకున్నాయి. రహదారిపై కాంక్రీటు స్లాబులు, ఇనుప మేకులు, ముళ్ల కంచెలతో అడ్డుకట్ట వేశారు. అయినా వెనక్కి తగ్గని రైతులపై బాష్పవాయువు గోళాలు ప్రయోగించారు. అంతకుముందు పంజాబ్ కిసాన్ మజ్దూర్ సంఘర్షణ సమితి సభ్యులు దేశ రాజధానికి ట్రాక్టర్లలో బయలుదేరారు. తాము సామాన్య ప్రజలకు ఇబ్బంది కలిగించకుండానే ఢిల్లీచలో చేపడతామని తెలిపారు. చర్చల్లో కేంద్ర మంత్రుల నుంచి సానుకూల నిర్ణయాలు ఏమీరాలేదన్నారు. రైతుల ఆందోళనను బూచిగా చూపి భద్రత పేరుతో హరియాణా, పంజాబ్ ప్రజలను వేధిస్తున్నారని రైతు సంఘం నేతలు విమర్శించారు. పంజాబ్, హరియాణా సరిహద్దులను అంతర్జాతీయ సరిహద్దు మాదిరి మార్చేశారని విమర్శించారు. తాము ప్రభుత్వంతో చర్చలకు ఇప్పటికీ సిద్ధమేనని తెలిపారు. శంభు సరిహద్దులో 10 వేల మంది రైతులు ఉన్నట్లు రైతు సంఘం 'కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ కమిటీ' ప్రధాన కార్యదర్శి సర్వాన్ సింగ్ పంధేర్ తెలిపారు. రైతులంతా శాంతియుతంగానే ఉన్నారని చెప్పారు. తమపై డ్రోన్ల ద్వారా టియర్ గ్యాస్ ప్రయోగం చేపట్టారని వెల్లడించారు. ప్రభుత్వం తమ డిమాండ్లకు అంగీకరించేవరకు నిరసన కొనసాగుతుందని స్పష్టం చేశారు. మరోవైపు, పోలీసులు బాష్ప వాయుగోళాలు ప్రయోగిస్తున్న నేపథ్యంలో కొందరు రైతులు గ్యాస్ మాస్కులు ధరించి కనిపించారు.

రాజధానిలో పోలీసుల పహారా

మరోవైపు దేశ రాజధాని మొత్తం పోలీసుల పహారా కొనసాగుతోంది. 144 సెక్షన్ విధించిన పోలీసులు...నిఘా వర్గాల సమన్వయంతో రైతులు ఎటు నుంచి వస్తారో అంచనా వేసి ఆయా ప్రాంతాల వద్ద పోలీసులతో పాటు ఆర్‌పీఎఫ్‌బలగాలను.. మోహరించారు. ఘాజీపూర్ సరిహద్దు వద్ద కాంక్రీట్ బారికేడ్లతో రహదారిని మూసివేశారు. వాహనాలను తనిఖీ చేసిన తర్వాతనే ఢిల్లీలోకి అనుమతిస్తున్నారు. టిక్రీ సరిహద్దులను కూడా మూసివేశారు. పోలీసు బలగాలను, క్విక్ రెస్పాన్స్ బృందాలను సిద్ధంగా ఉంచారు. డ్రోన్లతో సైతం ట్రాఫిక్‌ను పర్యవేక్షిస్తున్నారు. పోలీసులు చేసిన భద్రతా ఏర్పాట్లతో ఢిల్లీలోకి దారితీసే మార్గాల్లో వందలాదిగా వాహనాలు నిలిచిపోయాయి. ఘాజీపూర్ వద్ద, ఢిల్లీ-నోయిడా చిల్లా సరిహద్దు వద్ద భారీగా వాహనాలు నిలిచి చోదకులకు చుక్కలు కనిపిస్తున్నాయి. ఒక కిలోమీటరు దూరానికి గంట పడుతోందని చోదకులు వాపోతున్నారు.

రైతులు ఆందోళన నేపథ్యంలో దేశ రాజధానిలోని ఎనిమిది మెట్రో స్టేషన్‌లను మూసివేశారు అధికారులు. మరోవైపు రైతుల ఆందోళనలు తీవ్రతరమయ్యే క్రమంలో అరెస్ట్‌చేసే నిరసనకారులను తరలించేందుకు భావన స్టేడియాన్ని జైలులా మార్చేందుకు ఢిల్లీ ప్రభుత్వాన్ని కేంద్రం అనుమతి కోరింది. ఈ ప్రతిపాదనను కేజ్రీవాల్ సర్కార్ తిరస్కరించింది. యూపీ, పంజాబ్, హరియాణాతో ఉన్న సరిహద్దుల్లో జాతీయ రహదారులను పూర్తిగా మూసివేశారు. ఢిల్లీకి బయలుదేరిన కర్షకులకు మద్దతుగా తమిళనాడులోని తిరుచ్చికి చెందిన కొందరు రైతులు మద్దతు తెలిపారు. మానవ అస్థి పంజరాలు పట్టుకుని రోడ్డుపై పడుకుని నిరసన వ్యక్తం చేశారు. మరికొందరు మొబైల్ ఫోన్ టవర్ ఎక్కి తమ మద్దతును తెలియజేశారు.

హడావుడిగా చట్టం తేలేం: కేంద్రం

సంబంధిత వర్గాలతో విస్తృత సంప్రదింపులు జరపకుండా కనీస మద్దతు ధరపై చట్టాన్ని తొందరపడి తీసుకురాలేమని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి అర్జున్ ముండా తెలిపారు. ఎంఎస్‌పీ గ్యారెంటీకి సంబంధించిన డిమాండ్‌పై రైతులతో చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు స్పష్టత ఇచ్చారు. రాజకీయ ప్రయోజనాల కోసం తమ నిరసనను అప్రతిష్ఠపాలు చేసే విషయంపై అప్రమత్తంగా ఉండాలని రైతులను హెచ్చరించారు. రెండు దఫాలుగా జరిగిన చర్చల్లో కర్షకుల అనేక డిమాండ్లను అంగీకరించామని, కొన్ని అంశాలపై ఇంకా ఒప్పందం కుదరలేదని చెప్పారు. ఈ ఆందోళన అంశంపై ఇప్పటికే కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, అర్జున్ ముండాల నేతృత్వంలోని ప్రభుత్వ బృందం.. రైతుల ప్రతినిధులుగా వచ్చిన ఎస్‌కేఎం (రాజకీయేతర) నేత జగ్జీత్‌సింగ్ డల్లేవాల్, కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ కమిటీ ప్రధాన కార్యదర్శి సర్వన్‌సింగ్ పంధేర్ తదితరులతో సోమవారం చర్చలు జరిపింది. రైతులు చేసిన డిమాండ్లలో కొన్నింటికి మంత్రుల బృందం అంగీకారం తెలపగా... రైతుల ప్రధాన డిమాండ్ ఎంఎస్‌పీకి చట్టబద్ధతపై ఏకాభిప్రాయం కుదరలేదు. దీంతో అన్నదాతలు ఆందోళనకు దిగారు.

మేం చట్టం తెస్తాం: కాంగ్రెస్

మరోవైపు, రైతుల ఆందోళన విషయంలో మోదీ సర్కారుపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. అన్నదాతల నిరసనను పోలీసులు అడ్డుకోవడాన్ని తీవ్రంగా ఖండించింది. ఇదే సమయంలో కనీస మద్దతు ధర చట్టబద్ధతపై హామీ ఇచ్చింది. "రైతు సోదరులారా.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే స్వామినాథన్ కమిషన్ ప్రకారం ప్రతి రైతు పండించే పంటకు కనీస మద్దతు ధర ఇచ్చేలా చట్టం తీసుకురావాలని నిర్ణయించింది. ఇది 15 కోట్ల రైతు కుటుంబాల జీవితాలను మారుస్తుంది. న్యాయం కోసం మేం ఎంచుకున్న మార్గంలో ఇదే మా తొలి గ్యారెంటీ అని పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ 'ఎక్స్ ' వేదికగా పోస్ట్ చేశారు.

డీఎస్సీతో... దోబూచులాట!

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్ అభ్యర్థులకు కఠిన పరీక్షగా మారింది. ఉద్యోగ వయోపరిమితిని పెంచకుండా సీఎం జగన్ తమకు దగా చేశారని నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. అతి తక్కువ సమయంలో భారీ సిలబస్ చదవడం భారంగా మారిందని వాపోతున్నారు. అరకొర పోస్టులతో నోటిఫికేషన్ జారీపై సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. సుదీర్ఘకాలంపాటు శిక్షణలో ఉన్న అభ్యర్థులంతా డీఎస్సీకి సన్నద్ధమయ్యారు. డీఎస్సీ రాదేమోనని గతంలో ప్రిపరేషన్‌ను నిలిపివేసిన అభ్యర్థులకు ఇప్పుడు దిక్కుతోచడం లేదు. 6,100 పోస్టులతో ఈనెల 12న నోటిఫికేషన్ జారీజేశారు. నెల రోజుల్లోనే పరీక్షలకు సన్నద్ధమవడం అసాధ్యమని అభ్యర్థులు అంటున్నారు. మార్చి 15 నుంచి 30వ తేదీ వరకు పరీక్షలను నిర్వహించనున్నారు. మరోవైపు ఈనెల 8న ఏపీ టెట్ నోటిఫికేషన్ హడావుడిగా ఇచ్చి, 27వ తేదీ నుంచి మార్చి తొమ్మిది వరకు పరీక్ష షెడ్యూలు విడుదల చేశారు. ఇప్పటికే టెట్‌లో మంచి స్కోర్ వచ్చిన వారంతా డీఎస్సీకి సిద్ధమవుతారు. మంచి స్కోర్ రాని వారుగానీ, కొత్తగా బీఈడీ, డీఎడ్, భాషా పండిత కోర్సులు పూర్తి చేసిన వారు గానీ టెట్‌లో తప్పనిసరిగా అర్హత పొందాలి. ఇలాంటి వారికి ఏకకాలంలో టెట్, డీఎస్సీ పరీక్షలకు సన్నద్ధమవడం తలకుమించిన భారంగా మారింది. విద్యాహక్కు చట్టం ప్రకారం, దేశ వ్యాప్తంగా టెట్ పరీక్షలు ఆయా రాష్ట్రాలు ప్రతి ఆరు నెలలకు ఒకసారి నిర్వహించాలి. అంటే ఏడాదికి రెంటు టెట్ పరీక్షలు ఉండాలి. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇప్పటివరకు ఒక టెట్ నిర్వహించగా, మరో టెట్‌కు తాజాగా షెడ్యూలు జారీజేశారు. ఈ విషయంలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్న విమర్శలున్నాయి. మార్చి 15 నుంచి టెన్త్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. అదే సమయంలో డీఎస్సీ ఎలా నిర్వహిస్తారని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. ఒక వైపు ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఉపాధ్యాయులుగా పనిచేస్తూ టెట్, డీఎస్సీ పరీక్షలకు చాలా మంది సిద్ధమవుతున్నారు. అలాంటి వారికి టెన్త్ పరీక్షలసమయంలో డీఎస్సీ నిర్వహించడం వలన అసౌకర్యం ఏర్పడుతుందని పేర్కొంటున్నారు.

భారీ సిలబస్‌లిపై గందరగోళం

డీఎస్సీ సిలబస్‌పై అభ్యర్థులు అయోమయానికి గురవుతున్నారు. డీఎస్సీ-2018 నోటిఫికేషన్ సిలబస్ ఆధారంగానే డీఎస్సీని నిర్వహిస్తామన్న మార్గదర్శకాలతో వీరికి దిక్కుతోచడం లేదు. ఆరు నుంచి 10వ తరగతి పాఠ్యపుస్తకాలు కొత్త సిలబస్‌తో ముద్రించారు. వాటినే ప్రభుత్వం, ప్రైవేట్ విద్యా సంస్థల్లో విద్యార్థులకు బోధిస్తున్నారు. అభ్యర్థులు కొత్త పాఠ్యాంశాల ఆధారంగానే పరీక్షలపై దృష్టి పెట్టారు. దీంతో పాత సిలబస్ చదవవాలంటే దాదాపు 150 పాత, కొత్త పాఠ్యపుస్తకాలను ప్రత్యేకంగా అధ్యయనం చేయాలి. అటు టెట్‌కూ అదే పరిస్థితి ఎదురవుతోంది. స్కూల్ అసిస్టెంట్ పరీక్షను మొత్తం 80 మార్కులకు నిర్వహిస్తారు.

హామీల అమలు ఇంకెప్పుడు?

(మొదటిపేజీ తరువాయి)

నెల దాటినా ఇంతవరకు ఇచ్చిన హామీల అమలుకు చర్యలు తీసుకోలేదని వారు మండిపడ్డారు. అందువల్లే తప్పనిసరి పరిస్థితుల్లో, ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా సోమ, మంగళవారాల్లో నల్ల బ్యాడ్జిలు ధరించి కార్మికులు విధులకు హాజరై... రాష్ట్రమంతా ధర్నాలు చేపట్టామన్నారు. శానిటరీ ఎన్విరాన్‌మెంట్‌లోకి మార్చిన డ్రైవర్లకు, యూజీడీ వర్కర్లకు, పార్కుల్లో పనిచేస్తున్న టాయిలెట్ వర్కర్లకు, పెంచిన వేతనాలు వర్తింపజేయాలని కోరారు. సమ్మె ఒప్పందంలో భాగంగా ప్రభుత్వం కార్మికులకు చెల్లించాల్సిన 1000 రూపాయలు రాష్ట్రంలో ఏ ఒక్క మున్సిపాలిటీ ఇవ్వలేదన్నారు. ఎన్ఎంఆర్‌లను క్రమబద్ధీకరిస్తామని, ఆ తర్వాత వారికి పీఆర్సీ ప్రకారం వేతనం ఇస్తామని ఆరోజు మినిట్స్‌లో పొందుపరిచారు... కానీ వారికి ఆ మేరకు వేతనాలు, అలవెన్సులు ఇవ్వలేదన్నారు.

సచివాలయాల వ్యవస్థ వచ్చిన తర్వాత మున్సిపల్ కార్మికులపై అదనపు భారం పడుతున్నదన్నారు. సమ్మె ముగించాలని, యూనియన్ డిమాండ్లు అన్నింటినీ పది రోజుల్లోనే అమలు పరుస్తామని చెప్పిన అధికార యంత్రాంగం... నెల దాటినా కనీసం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. రెక్కాడితే డొక్కాడని కార్మికుల పట్ల ఇంత నిర్లక్ష్యమా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, కార్మికులకు ఇచ్చిన హామీల అమలుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జగన్ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని వారు హెచ్చరించారు.

నర్సాపురంలో జరిగిన ధర్నాలో ఏఐటీయూసీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జాతీయ సమితి సభ్యులు నెక్కంటి సుబ్బారావు, గుంటూరులో రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ బందెల రవికుమార్, బాపట్లలో వర్కింగ్ ప్రెసిడెంట్ కోటి దాస్, భీమవరంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ మల్లేశ్వరరావు, అనంతపురంలో రాష్ట్ర కార్యదర్శి రాజేశ్‌గౌడ్, కర్నూలులో ఉపాధ్యక్షుడు పులగం మద్దిలేటి, తిరుపతిలో దొరస్వామి, అమలాపురంలో తాడికొండ వాసు, కాకినాడలో తోక ప్రసాద్, రాజమండ్రిలో దుర్గమ్మ, విశాఖలో సత్యనారాయణ, విజయనగరంలో రాష్ట్ర సమితి సభ్యులు కామేశ్, శ్రీకాకుళంలో కల్యాణి అప్పలరాజు, మదనపల్లెలో సురేశ్ కుమార్, కడపలో తారకరామారావు, నంద్యాలలో అబ్బాస్, రంజిత్, చిత్తూరులో ఉపాధ్యక్షుడు జె.రామచంద్రయ్య పాల్గొన్నారు.

రైతును నట్టేట ముంచిన బీజేపీ

- హామీల అమలులో విఫలం
- అంబానీ, అదానీలకు మోదీ ఊడిగం
- 16న గ్రామీణ బంద్‌కు మద్దతు: రామకృష్ణ

విశాలాంధ్ర-పత్తికొండ: రైతాంగాన్ని ఆదుకోవడంలో బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ విమర్శించారు. కర్నూలు జిల్లా పత్తికొండలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి.రామ చంద్రయ్యతో కలిసి మంగళవారం రామకృష్ణ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రధాని మోదీ ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చలేదని రామకృష్ణ ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను అంబానీ, అదానీలకు అప్పనంగా కట్టబెడుతూ కార్పొరేట్ శక్తులకు మోదీ ఊడిగం చేస్తున్నారన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. పంట పెట్టుబడికి రైతులు తీసుకున్న బ్యాంకు రుణాలు పూర్తిగా మాఫీ చేయాలని, డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలన్నారు. జగన్ పాలనలో రాష్ట్రాభివృద్ధి కుంటుపడిందని రామకృష్ణ వ్యాఖ్యానించారు. 175 అసెంబ్లీ నియోజకవర్గాలలో వైసీపీ గెలుస్తుందని ముఖ్యమంత్రి జగన్ ప్రగల్బాలు పలుకుతున్నారని, అలాంటప్పుడు మంత్రులు, ఎమ్మెల్యేల నియోజకవర్గాలు మార్చడం ఎందుకని సూటిగా ప్రశ్నించారు. మోదీ, జగన్‌మోహన్ రెడ్డి దురహంకార పాలనకు చరమగీతం పాడాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా అధ్వర్యంలో ఈనెల 16న తలపెట్టిన గ్రామీణ బంద్‌కు సీపీఐ సంపూర్ణ సహకారం అందిస్తుందని, గ్రామీణ రైతులు, వ్యవసాయ కూలీలు, పట్టణ కార్మిక, కర్షకులు, మహిళలు, విద్యార్థి, యువజనులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సీపీఐ ఉమ్మడి కర్నూలు జిల్లా మాజీ కార్యదర్శి భీమ లింగప్ప, మండల కార్యదర్శి డి. రాజా సాహెబ్, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, ఏపీ రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు పెద్ద వీరన్న, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గురుదాస్ పాల్గొన్నారు.

16 నాటి బంద్‌లో పాల్గొనండి

విశాలాంధ్ర-విజయవాడ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక, సంయుక్త కిసాన్ మోర్చా దేశవ్యాప్త పిలుపుమేరకు ఈ నెల 16వ తేదీన జరగనున్న 'గ్రామీణ బంద్-పారిశ్రామిక సమ్మె'కు మద్దతు ప్రకటిస్తున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ బంద్‌లో రైతు, కార్మిక, ప్రజాసంఘాలు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ పరిరక్షణ కోసం ఉక్కు పరిశ్రమ కార్మికులు సమ్మెలో పాల్గొనాలని కోరారు. బంద్, సమ్మెలలో కమ్యూనిస్టు పార్టీ శ్రేణులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని ప్రజాసంఘాలు, యావన్మంది ప్రజానీకం ఆందోళనను జయప్రదం చేయాలని కోరారు.

డీహెచ్‌పీఎస్ సంఘీభావం

కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసనగా ఈ నెల 16న తలపెట్టిన గ్రామీణ బంద్, కార్మిక సమ్మెకు దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) సంపూర్ణ సహకారం అందిస్తుందని సమితి రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ బుట్టి రాయప్ప మంగళవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందించాల్సిన ప్రభుత్వాలు... పోరాడి సాధించుకున్న హక్కులను సైతం కాలరాస్తున్నాయని విమర్శించారు. రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగించే దుశ్చర్యలకు పాల్పడుతూ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. బంద్‌ను జయప్రదం చేసేందుకు డీహెచ్‌పీఎస్ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

రేపు సీఎం కర్నూలు, గుంటూరు జిల్లాల పర్యటన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 15న కర్నూలు, గుంటూరు జిల్లాల్లో పర్యటించనున్నారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి మనవడి వివాహానికి సీఎం హాజరవుతారు. గుంటూరు జిల్లా ఫిరంగిపురంలో వలంటీర్ల అభినందన సభలో ఆయన పాల్గొంటారు. ఉదయం 9.30 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి కర్నూలుకు చేరుకుంటారు. అక్కడ బళ్లారి రోడ్‌లోని ఫంక్షన్ హాల్‌లో జరిగే వివాహానికి హాజరవుతారు. అనంతరం తాడేపల్లికి సీఎం చేరుకుంటారు. మధ్యాహ్నం 2.40 గంటలకు బయలుదేరి ఫిరంగిపురానికి చేరుకుంటారు.

జగన్ పాలన అప్పులమయం: తులసిరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జగన్ పాలనలో అప్పులు ఫుల్... అభివృద్ధి నిల్ అని కాంగ్రెస్ నాయకుడు ఎన్.తులసిరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో విమర్శించారు. 1956 నుంచి 2014 వరకు 58 సంవత్సరాల్లో 16 మంది ముఖ్యమంత్రుల పాలనలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పు రూ.లక్ష కోట్లు అని వివరించారు. 2014-19 వరకు ఐదేళ్లలో చంద్రబాబు ప్రభుత్వం చేసిన అదనపు అప్పు రూ.1.5 లక్షల కోట్లు కాగా, 2019 నుంచి నేటి వరకు నాలుగేళ్ల తొమ్మిది నెలల్లో జగన్ ప్రభుత్వం చేసిన అదనపు అప్పు రూ.ఎనిమిది లక్షల కోట్లు అని పేర్కొన్నారు. వ్యవసాయ ప్రధానమైన రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులు నిధులు లేక నీరసించిపోయాయని, రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారిందన్నారు. జగన్ పాలనలో సంక్షేమం మేడి పండు చందమనీ, ఇచ్చింది గోరంత లాక్కొన్నదేమో కొండంత అని ఎద్దేవా చేశారు. అమ్మఒడి నాన్న బుడ్డికి చాలడం లేదని, మట్టిముంత ఇచ్చి వెండి చెంబు దొంగలించినట్లుందని అన్నారు.

లోకేశ్‌పై రెడ్‌బుక్ కేసు విచారణ 21కి వాయిదా

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రెడ్ బుక్ పేరుతో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తమను బెదిరిస్తున్నారని కొందరు అధికారులు ఏసీబీ కోర్టును ఆశ్రయించడంతో కోర్టు ఆదేశాలతో గత ఏడాది డిసెంబర్ చివరిలో సీఐడీ నోటీసు జారీచేసింది. నారా లోకేశ్‌ను అరెస్ట్ చేయాలని సీఐడీ వేసిన పిటిషన్‌పై ఏసీబీ కోర్టు మంగళవారం విచారణ జరిపింది. రెడ్ బుక్‌లో ప్రభుత్వ అధికారుల పేర్లు ఉన్నాయని బెదిరిస్తూ 41ఏ నిబంధలకు విరుద్ధంగా లోకేశ్ వ్యవహరిస్తున్నారని సీఐడీ పిటిషన్‌లో పేర్కొంది. ఈ కేసును ఏసీబీ కోర్టు ఈ నెల 21కి వాయిదా వేసింది. యువగళం పేరుతో చేపట్టిన పాదయాత్ర సందర్భంగా జరిగిన సభల్లో అధికారపార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి చట్టాన్ని ధిక్కరిస్తూ టీడీపీ నేతలు, కార్యకర్తలను వేధింపులకు గురి చేసిన కొందరు అధికారుల పేర్లను ఒక రెడ్ బుక్‌లో నోట్ చేసుకుంటున్నట్లు లోకేశ్ ప్రకటించారు. వారిపై తమ ప్రభుత్వం ఏర్పాటు కాగానే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీనిపై సీఐడీ అధికారులు ఏసీబీ కోర్టును ఆశ్రయించారు.

రాజధానిపై వైసీపీ పిల్లిమొగ్గలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర రాజధాని విషయంలో వైసీపీ పిల్లిమొగ్గలు వేస్తుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ గడువు వైసీపీ సీనియర్ నేత వైవీ సుబ్బారెడ్డి ప్రతిపాదించడం, దానికి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వంతపాడటం చూస్తుంటే వైసీపీ ఉద్దేశపూర్వకంగానే ప్రజలను గందరగోళానికి గురిచేస్తోందన్నారు. తెలంగాణకు వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొట్టి తమ వైఫల్యాన్ని కప్పిపెట్టుకునే ప్రయత్నం చేస్తున్నట్లు అర్థమవుతోందని పేర్కొన్నారు. తెలంగాణ ఎన్నికలకు ముందు నాగార్జునసాగర్ వద్ద పోలీసులు మోహరించి నాటకం ఆడినట్లుగా, ఇప్పుడు మరో కొత్త నాటకానికి వైసీపీ తెరలేపిందన్నారు. అమరావతి రాజధానిగా దారి తప్పించే ప్రయత్నం చేస్తోందని, ఇది ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఏమాత్రం సమ్మతం కాదని అన్నారు.

రైతులకు హామీలేని స్వల్పకాలిక రుణాలివ్వాలి: జమలయ్య

విశాలాంధ్ర- చింతలపూడి: రైతులు, కౌలు రైతులకు ఎటువంటి హామీ లేకుండా స్వల్పకాలిక రుణాలు మంజూరు చేయాలని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య డిమాండ్ చేశారు. ఆర్బీఐ నిబంధనలు పరిగణలోకి తీసుకోకుండా తమను మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ సోమవారం యూనియన్ బ్యాంకు వద్ద రైతులు, కౌలు రైతులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా జమలయ్య మాట్లాడుతూ, రైతులకు పంట రుణాలు ఇవ్వాలంటే పట్టాదారు పాస్ పుస్తకం, టైటిల్ డీడ్, వన్ బీతో పాటు జామీను అడగడం నిబంధనలకు విరుద్ధమైందని, రిజర్వ్ బ్యాంక్ నిబంధనల ప్రకారం రూ.1.60 లక్షల వరకు ఎటువంటి హామీ లేకుండానే వ్యవసాయ రుణాలు మంజూరు చేయాలని అన్నారు. కౌలు కార్డులు ఉన్నవారికి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచి జామీన్లు లేని పంట రుణాలు మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. చిన్న, సన్నకారు, కౌలు రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులు ఇవ్వాలన్నారు. గతేడాది పంట రుణాలు తిరిగి చెల్లించిన వారికి వడ్డీ రాయితీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రేచర్ల, మల్లాయగూడెం, సమిటివారిగూడెం, ఎర్రగుంటపల్లి ,పాత చింతలపూడి గ్రామాల్లో రైతులు ఈ విధమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సోమశేఖర్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి దొంతా కృష్ణ, రైతు సంఘం నాయకుడు ప్రసాద్, ఎస్‌కే జానీ, ఏఐటీయూసీ జిల్లా కో కన్వీనర్ తొర్లపాటి బాబు, కొమ్మిన వెంకటేశ్వరరావు,పెనుమత్స సత్యనారాయణ రాజు, దంత వెంకట్రావు, డి.సాంబశివరావు పాల్గొన్నారు.

దోపిడీదారులను సాగనంపాలి

- ఉత్తరాంధ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం
- మోసానికి మారుపేరు జగన్
- శంఖారావం సభలలో నారా లోకేశ్

విశాలాంధ్ర-మెళియాపుట్టి/శ్రీకాకుళం/పార్వతీపురం): ఉత్తరాంధ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, అన్ని వర్గాల సంక్షేమానికి జనసేనతో కలిసి కృషి చేస్తామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ హామీ నిచ్చారు. ప్రజా సమస్యలను గాలికి వదిలేసి అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న దోపిడీదారులను సాగనంపాలని పిలుపునిచ్చారు. అన్ని రంగాలలో రాష్ట్రాన్ని ముందుకు సాగిస్తామని హామీనిచ్చారు. అభివృద్ధే లక్ష్యంగా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఉమ్మడిగా కృషి చేస్తున్నారని, ప్రతి కార్యకర్త ఓ సైనికుడిగా పని చేయాలని లోకేశ్ సూచించారు. లోకేశ్ మంగళవారం శ్రీకాకుళం జిల్లా, పాతపట్నంతో పాటు పార్వతీపురం, మన్యం జిల్లాలోని పాలకొండ, కురుపాం నియోజక వర్గంలోని గరుగుబిల్లి మండలంలోని ఉల్లిభద్రలో మంగళవారం జరిగిన శంఖారావం సభలలో ప్రసంగించారు. రాబోయేది టీడీపీ-జనసేన ప్రభుత్వమని నినదించారు. మోసానికి మరో రూపం జగన్‌మోహన్ రెడ్డిని విమర్శించారు. రెండు లక్షల ముప్పై వేల ఉద్యోగాలు ఇస్తామని, ఏడాదికో డీఎస్సీ అని ఆశలు కల్పించిన యువతను జగన్ మోసం చేశారన్నారు. తాజా డీఎస్సీ నోటిఫికేషన్ కూడా మోసమేనన్నారు. తమ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ప్రతి సంవత్సరం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి ప్రతి పోస్టు భర్తీ చేస్తామని లోకేశ్ హామీనిచ్చారు. తప్పు చేయని చంద్రబాబును 53 రోజులు జైల్లో పెట్టారని గుర్తుచేశారు. అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రజల్లో అవగాహన కల్పించే బాధ్యత టీడీపీ, జనసేన కార్యకర్తలపై ఉందనిచ 'బాబు సూపర్ సిక్స్'ను విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. తమ ప్రభుత్వం రాగానే ఈ పథకాలన్నీ అమలు చేస్తామని లోకేశ్ హామీనిచ్చారు. జగన్ ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రజలు సాగనంపడం తథ్యమన్నారు. జగన్‌ను సొంత తల్లి, చెల్లి నమ్మడం లేదని, ప్రజలు ఎలా నమ్ముతారని ప్రశ్నించారు. ఉమ్మడి విజయనగరం జిల్లాకు 50 హామీలు ఇచ్చి కనీసం ఒక్కటీ అమలు చేయలేదని ఎద్దేవా చేశారు. వైసీపీ పాలనలో రాష్ట్రంలో ఇసుక-మద్యం మాఫియా రాజ్యమేలుతున్నాయే తప్ప అభివృద్ధి లేదని విమర్శించారు. జగన్ అంటే జైలు, బాబు అంటే బ్రాండు, జగన్ ప్రిజనర్, బాబు విజనరీ అని లోకేశ్ వ్యాఖ్యానించారు. అనంతరం ఎంపీ రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వ అరాచకాలను ఎండగట్టాలని, తిరగుబాటుకు ఇదే సమయమని ప్రజలకు పిలుపునిచ్చారు. లోకేశ్ రేపటి తరానికి భరోసా అని అన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని రామ్మోహన్ నాయుడు కోరారు. ఎస్టీ, ఎస్సీ, బీసీలకు అన్ని విధాలా న్యాయం చేసినది టీడీపీనే అన్నది మరువద్దని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు కూన రవికుమార్, మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ, ఎమ్మెల్సీ చిరంజీవి, జనసేన జిల్లా అధ్యక్షుడు పి.చంద్రమోహన్, జనసేన పాతపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి గేదెల చైతన్య, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు కిమిడి కళా వెంకటరావు, జోన్ 1 సమన్వయకర్త దామచర్ల సతీష్, మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌తో పాటు పాలకొండ, కురుపాం,పార్వతీపురం నియోజక వర్గాల ఇన్‌చార్జీలు నిమ్మక జయకృష్ణ, తోయక జగదీశ్వరి, విజయ్ చంద్ర, టీడీపి రాష్ట్ర కార్యదర్శి వీరేశ చంద్ర దేవ్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు పాల్గొన్నారు. కాగా, లోకేశ్ బుధవారం పార్వతీపురం, సాలూరు, బొబ్బిలిలో జరుగనున్న శంఖారావం సభలలో పాల్గొంటారు.

విశాఖ కలెక్టర్‌ను బదిలీ చేయండి: టీడీపీ

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: రాబోయే సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరగాలంటే విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జునను తక్షణం బదిలీ చేయాలని మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి డిమాండ్ చేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విశాఖ జిల్లా కలెక్టర్‌గా ఆయన వచ్చి మూడేళ్లు అవుతుందని, ఎన్నికల్లో వైసీపీకి సహకరించేందుకే ఆయన్ను బదిలీ చేయలేదని బండారు ఆరోపించారు. ఓట్లు చేర్పులు, తొలగింపుపై అనేక ఆరోపణలు వచ్చాయని, కనీసం చర్యలు తీసుకోలేదని అన్నారు. ఆయన హయాంలోనే అనేక భూ కుంభకోణాలు జరిగాయని, ఎన్ని ఫిర్యాదులు చేసినా కలెక్టర్ ఒక్క ఫిర్యాదుపైనా చర్య తీసుకోలేదన్నారు. విజయసాయిరెడ్డి, సుబ్బారెడ్డితో కలెక్టర్ చేతులు కలిపారని, ముదపాక ఎస్సీ భూముల్ని అక్రమంగా లాక్కున్నారని ఆరోపించారు. ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా రిజిస్ట్రేషన్ కోసం వత్తిడి తెచ్చారని, బాధితులు కోర్టుకెళ్తే ఎమ్మార్వోను బదిలీ చేసి చేతులు దులుపుకున్నారన్నారు. జెర్రిపోతుల భూ సమస్యపై కలెక్టర్ ఇప్పటికీ చర్య తీసుకోలేదని, విశాఖ కేంద్రంగా 12 భూ కుంభకోణాలు జరిగాయని, వేలాది కోట్ల రూపాయల విలువ చేస్తాయని, కలెక్టర్ హయాంలోనే దశపల్లా భూ బదిలీ జరిగిపోయిందన్నారు. రుషికొండపై అక్రమ నిర్మాణాలపై ఏంచర్య తీసుకున్నారని, ఓ కలెక్టర్ ఇలా ఉంటే ఎన్నికలు ఎలా సజావుగా ఎలా జరుగుతాయో ఈసీ ఆలోచించాలన్నారు. నీతివంతమైన జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్‌ను ఎందుకు బదిలీ చేశారని ప్రశ్నించారు. కలెక్టర్‌పై ఈసీ విచారణ జరిపి చర్య తీసుకోవాలని, వచ్చేది జనసేన-టీడీపీ ప్రభుత్వమేనని, తప్పు చేసిన అధికారులకు చర్యలు తప్పవన్నారు. విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ, కలెక్టర్ మల్లికార్జున హయాంలో జరిగిన స్కామ్‌లకు సంబంధించి అన్ని ఆధారాలు ఉన్నాయని, అక్రమంగా ఓట్లు చేరుస్తున్నారని అన్ని ఆధారాలతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారన్నారు. తూర్పు నియోజకవర్గంలో 90 బూత్‌ల్లో ఒక్కొక్కరికి రెండు, మూడు, నాలుగేసి ఓట్లు ఉన్నాయన్నారు. సచివాలయం వ్యవస్థ వల్ల ఈ పరిస్థితి చోటుచేసుకుందన్నారు. బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి పరిశీలన చేయాలనీ, కాని అలా జరగడం లేదన్నారు. తప్పుడు ఓట్ల నమోదుపై మళ్లీ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. బైరెడ్డి పోతనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల బకాయిలపై శ్వేతపత్రం ఇవ్వాలి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉద్యోగులకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలపై తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని టీడీపీ ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు డిమాండ్ చేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళ వారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆర్థిక మంత్రి లేకుండా జరిగిన చర్చల్లో ఆర్థికపరమైన విషయాలు ఎలా కొలిక్కి వస్తాయో ఉద్యోగసంఘం నేతలే చెప్పాలన్నారు. ఉద్యోగ సంఘాలకు, ప్రభుత్వ సబ్ కమిటీకి మధ్య జరిగిన చర్చలపై ఇరు వర్గాలు సిగ్గుపడాలన్నారు. సబ్ కమిటీలో సభ్యుడిగా ఉన్న ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్ర నాథ్ రెడ్డే చర్చలకు రాలేదు... మరో సభ్యుడైన మంత్రి ఆదిమూలపు సురేశ్ స్కైప్ ద్వారా ఐదు నిమిషాలు మాట్లాడి తప్పుకున్నారు. కేవలం మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ సలహా దారు సజ్జల రామకృష్ణా రెడ్డి, చీఫ్ సెక్రటరీ, ఆర్థిక శాఖ కార్యదర్శి సత్యనారాయణ మాత్రమే చర్చల్లో పాల్గొని మమ అనిపించారని విమర్శించారు. ఆర్థికశాఖ కార్యదర్శి చెప్పేవరకు ఉద్యోగులకు రూ.21 వేల కోట్లు చెల్లించాలనే విషయం వారికి కూడా తెలియదన్నారు. రూ.21 వేల కోట్లలో మార్చి 31 నాటికి రూ.5,500 తకోట్లు ఇస్తామన్న మంత్రి బొత్స మాటలు ఎంతవరకు నమ్మొచ్చని ఉద్యోగసంఘం నేతలు ఆలోచించారా? నెలనెలా రూ.4 వేల కోట్లు అప్పులు తెచ్చి జీతాలు ఇస్తున్న జగన్ సర్కార్ ఒకేసారి ఉద్యోగుల బకాయిలకు సంబంధించి రూ.5,500 కోట్లు నెలాఖరుకల్లా చెల్లిస్తుందంటే ఉద్యోగ సంఘాలు ఎలా నమ్ముతున్నాయని అశోక్‌బాబు ప్రశ్నించారు. ఒకటో తేదీన జీతాలిస్తే చాలనే దుస్థితికి ఉద్యోగుల్ని తీసుకొచ్చిన వైసీపీ ప్రభుత్వం, వారి డిమాండ్లు పరిష్కరిస్తుందా? లేదా అని ఉద్యోగ సంఘాలు ఆలోచించాలన్నారు. బకాయిలు మొత్తం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 29న రిటైరయ్యే బండి శ్రీనివాస్ ఉద్యోగుల పక్షాన తాను పోరాడతాను అనడం ఎంతవరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. ప్రభుత్వ మాటల్లో ఎంత నిజాయితీ ఉందో సంఘ నేతలు ఆలోచించుకోవాలన్నారు.

టోఫెల్ తరగతుల బాధ్యత డీఈవోలదే

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రపంచ స్థాయి పౌరులుగా రాష్ట్ర విద్యార్థులను తీర్చిదిద్దేందుకు, ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థుల్లో స్పోకెన్ ఇంగ్లీష్ నైపుణ్యాలను పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన టోఫెల్ తరగతులను అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తప్పనిసరిగా నిర్వహించాలని డీఈవోలు, ఆర్జేడీలను పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్ ఆదేశించారు. ఈ మేరకు అంతర్జాతీయ ప్రమాణాలకనుగుణంగా టోఫెల్ సర్టిఫికేషన్ కోసం ఈటీఎస్, ప్రిన్స్‌టన్ యుఎస్‌ఏ, ఎస్‌సిఈఆర్‌టి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖ మధ్య జరిగే సంయుక్త మూల్యాంకన (రెడీనెస్ సర్టిఫికేషన్) అంశాలను వివరిస్తూ మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రపంచవ్యాప్తంగా మొట్టమొదటి సారిగా ఎడ్యుకేషన్ టెస్టింగ్ సర్వీసెస్(ఈటీఎస్) ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ (యూఎస్‌ఏ), ఒక రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా విద్యార్థుల ప్రధాన పరీక్షకు సన్నద్ధతను (స్టూడెంట్స్ ప్రిపేర్డ్ నెస్) అంచనా వేస్తుండటం గమనార్హమని తెలిపారు. ఈ సందర్భంగా 3వ తరగతి నుండి 9వ తరగతి వరకు ఉన్న విద్యార్థులకు రోజువారీ టోఫెల్ తరగతులను నిర్వహించడం, ఆ విద్యార్థులకు వినే, మాట్లాడే నైపుణ్యాలను మెరుగుపరచడంపై దృష్టి పెట్టాలని డీఈవోలకు సూచించారు. 3 నుండి 5వ తరగతి విద్యార్థులకు ఏప్రిల్ 10 న, 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు ఏప్రిల్ 12 న మూల్యాంకనం జరుగుతుందని వెల్లడించారు. ఇటీవల తాను జిల్లాల పర్యటనలకు వెళ్లినప్పుడు అనేక పాఠశాలల్లో రోజూవారి టోఫెల్ తరగతులు నిర్వహించడం లేదన్న అంశాన్ని గమనించానని పేర్కొన్నారు. టోఫెల్ తరగతులు నిర్వహించడంలో విఫలమైతే డీఈవోలే జవాబుదారీగా వ్యవహరించాలన్నారు.

రేపు విజయవాడలో 'అగ్రి' బాధితుల న్యాయ పోరాట దీక్ష

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: అగ్రిగోల్డ్ బాధితులు ఈ నెల 15న న్యాయ పోరాట దీక్షకు పూనుకున్నారు. బాధితులకు పూర్తి న్యాయం చేస్తామని, ఆరు మాసాల్లోగా వడ్డీతో సహా డిపాజిట్లు మొత్తాలను చెల్లిస్తామని, మరణించిన బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియోను అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట అమలు కోసం చివరి బడ్జెట్ వరకు ఎదురుచూసి నిరాశకు గురయ్యామని తెలియజేస్తూ గురువారం ప్రభుత్వానికి తుది హెచ్చరికగా విజయవాడ ధర్నా చౌక్‌లో న్యాయ పోరాట దీక్షకు నిర్ణయించినట్లు అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈవీ నాయుడు, వి.తిరుపతి రావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని జిల్లాల నుంచి బాధితులందరూ పెద్దసంఖ్యలో విచ్చేసి దీక్షను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

'సజ్జల కుటుంబ సభ్యులకు రెండు చోట్ల ఓటు'

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి కుటుంబానికి మంగళగిరి, పొన్నూరు నియోజకవర్గాల్లో రెండు చోట్ల ఓట్లు ఉన్నాయని టీడీపీ సీనియర్ నేత ధూళిపాళ్ళ నరేంద్ర ఆరోపించారు. రాష్ట్రంలో దొంగ ఓట్ల దందాకు తాడేపల్లిలోనే కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వ మనడానికి ఇదే ఉదాహరణ అని పేర్కొన్నారు. తాడేపల్లి ప్యాలెస్‌లోనే దొంగ ఓట్ల దందా మొదలైందనడానికి ఇదిగో సాక్ష్యమంటూ ఆ వివరాలను ట్వీట్ చేశారు. సజ్జలతోపాటు, ఆయన భార్య, కొడుకు, కోడలికి పొన్నూరు నియోజకవర్గంలోని నంబూరు, మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని ఖాజా గ్రామాల్లో ఏఏ బూత్‌ల్లో ఓట్లు ఉన్నాయో వెల్లడించారు. తెల్లారితే మైక్ ముందు నీతి వ్యాఖ్యాలు వల్లించే సలహాల రెడ్డి మొత్తానికి...రెండు చోట్ల దొంగ ఓట్లతో అడ్డంగా దొరికిపోయారని ధూళిపాళ్ళ అన్నారు.

హామీలు అమలు చేయాలి

అంగన్‌వాడీ వర్కర్ల జేఏసీ డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: సమ్మెకాలంలో అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ జేఏసీ మంగళ వారం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. అలాగే ఒప్పుకున్న డిమాండ్లలో కొన్నింటిని సవరించాలని కోరింది. ఏఐటీయూసీ, సీఐటీయూ రాష్ట్ర ప్రతినిధులు మంగళవారం మంగళగిరిలోని ఏపీఐఐసీ కార్యాలయంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కమిషనర్ జానకి, ఇన్‌చార్జి కమిషనర్లను కలిసి వినతిపత్రం అందజేశారు. నాయకులు జె.లలిత, కె.సుబ్బరావమ్మ అనంతరం విలేకరులతో మాట్లడుతూ సమ్మె కాలంలో ప్రభుత్వం కొన్ని డిమాండ్లను ఆమోదించిందని, మినీ టీచర్లకు మెయిన్ టీచర్లుగా పదోన్నతి కల్పించేందుకు ఒప్పుకుందని చెప్పారు. గౌరవ వేతనాల చెల్లింపు, రేషన్ సమస్యల పరిష్కారం, యాప్‌ల సవరణలు, ప్రధాన మంత్రి బీమా యోజనకు సంబంధించి వయస్సు పెంపు, మే నెల మొత్తం వేసవి సెలవులు, పదవీవిరమణ పొందిన వారికి వెంటనే చెల్లింపులు జరపడం, సమ్మె కాలంలో చనిపోయిన వారికి గత జీవో తేదీలతో దహన సంస్కరాలకు ఇచ్చే రూ.20,000ను చెల్లించేలా జీవో ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ వర్కర్ల పోస్టుల భర్తీ, హెల్పర్లకు కార్మికులుగా పదోన్నతి, ఇందుకోసం సీనియారిటీని పరిగణనలోకి తీసుకోవాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. అన్ని అంశాలపై కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. వేతనాల బిల్లును త్వరలో పరిష్కరిస్తామని ఆమె చెప్పారన్నారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా గుర్తించడంపై ఢిల్లీలో జరగబోయే సమావేశంలో నిర్ణయిస్తామని, బీమా వయస్సు అంశాన్ని చర్చిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారన్నారు. నాయకులు ఈ సందర్భంగా కమిషనర్ జానకిని శాలువ, పుష్పగుచ్ఛాలతో సన్మానించారు. కార్యక్రమంలో కె. ప్రేమ, ఎం.శారమ్మ, గజలక్ష్మి పాల్గొన్నారు.

GREATER VISAKHAPATNAM SMART CITY CORPORATION LIMITED
VISAKHAPATNAM (GVSCCL)
NOTICE INVITNG TENDER (NIT)

Tender Notice No:GVSCCL/Projects/359(ICCC-O&M)/2023-24 , Dt:13/02/2024

GVSCCL desires to invite RFP for "Operations & Maintenance of existing Integrated Command and Control Center (ICCC) for a period of 5 (five) years in Visakhapatnam City". The details can be downloaded from website of **www.apeprocurement.gov.in.**

1.Download starting date: 13/02/2024
2. Download ending date: 26/02/2024 @ 4:00 PM
3.Last date of submission of bids: 26/02/2024 @ 5:00 PM

email : visakhapatnamsmartcity@gvsccl.in
Mobile No : **9550230777, 9603336622**

Sd/- MD & CEO, GVSCCL

సంపాదకీయం

రైతుల మీద మోదీ యుద్ధం !

వచ్చే సార్వత్రిక ఎన్నికలలో బీజేపీ 370 స్థానాలలో, ఎన్.డి.ఎ. భాగస్వామ్య పక్షాలు మరో 30 సీట్లు సంపాదిస్తాయి అని బీరాలు పలుకుతున్న మోదీ సర్కారుకు ఏ అందోళనను చూసినా వెన్నులో ఒణుకు పుడుతోంది. తాజాగా మంగళవారం నుంచి రైతులు రెండోసారీ దిల్లీ చలో యాత్ర మొదలు పెడ్తామని ప్రకటించగానే పంజాబ్, హరియాణాతో సహా అనేక రాష్ట్రాల నుంచి తరలివచ్చే రైతులు దిల్లీ చేరకుండా నిరోధించడానికి మోదీ ప్రభుత్వం సకల కుటిల యత్నాలూ చేసింది. మరో దేశంతో యుద్ధ సమయంలోనూ ఇలాంటి పోకడలు కనిపించవు. రోడ్లు తవ్వేసింది. రోడ్ల మీద కాంక్రీటుతో అడ్డు గోడలు నిర్మించింది. మేకులు పాతేసింది. కర్నాటక నుంచి దిల్లీ వెళ్తున్న రైతులను మార్గమధ్యమంలోనే అడ్డుకుంది. ఇలాంటి పని అనేక రాష్ట్రాలలో జరిగింది. 2020 ఆగస్టు 11 నుంచి ఒక సంవత్సరం నాలుగు నెలల రెండు రోజుల పాటు అంటే 2021 డిసెంబర్ 11 దాకా మొదటి దశ రైతుల ఉద్యమం సాగింది. అప్పుడూ రైతులను అడ్డుకోవడానికి మోదీ ప్రభుత్వం అనేక ప్రయత్నాలు చేసినా వేల సంఖ్యలో రైతులు దిల్లీ పొలిమేరల్లో బైఠాయించారు. వివిధ వర్గాల నుంచి, కడకు అంతర్జాతీయంగా మోదీ ప్రభుత్వ మంకుతనాన్ని తీవ్రంగా విమర్శించడంతో 2021 నవంబర్ 19న వివాదాస్పదమైన మూడు వ్యవసాయ చట్టాలను ఉపసంహరించుకున్నారు. ఈ చట్టాలనైతే వెనక్కు తీసుకున్నారు తప్ప రైతుల ఇతర కోర్కెలను ఇప్పటిదాకా ఆమోదించనే లేదు. మొదటి దశ ఉద్యమంలో భాగంగా 2021 జనవరి 26న ఎర్రకోటపై రైతుల జెండా ఎగురవేశారు. రైతులు అనుమతించిన దారిలో కాకుండా వేరే దారిలో వచ్చారని ఆరోపించి కేంద్ర ప్రభుత్వం దాష్టీకం చెలాయించింది. నిరసన తెలియజేసే హక్కు పౌరులకు ఉంది అన్న వాస్తవాన్ని మోదీ ప్రభుత్వం అంగీకరించడానికి సిద్ధంగా లేదు. ఈసారి అసలు రైతులు దిల్లీ చేరకుండా అనేక రకాలుగా అడ్డంకులు సృష్టించింది. కేంద్ర మంత్రులు ముగ్గురు చండీగఢ్ వెళ్లి రైతులతో సంప్రదింపులు జరిపారు. కానీ సమస్యను పరిష్కరించలేకపోయారు. ఇప్పుడూ దిల్లీ చలో ఉద్యమాన్ని విరమించి సంప్రదింపులు జరపాలని కేంద్ర మంత్రులు పాత పాటే ఆలపిస్తున్నారు. అయితే, ప్రభుత్వ కర్కశం కారణంగా ఈ పూటకు ఆందోళనను విరమిస్తున్నామనీ, బుధవారం ఉదయం తిరిగి ప్రారంభించేందుకు ప్రయత్నిస్తామని రైతు నాయకులు తెలిపారు. సింగు, తిక్రీ, గాజీపూర్ సరిహద్దుల్లో కనీసం 50,000 మంది భద్రతా దళాలను నియోగించి రైతులు దిల్లీ చేరకుండా కట్టు దిట్టం చేశారు. వాహనాల రాకపోకల మీద అనేక ఆంక్షలు విధించారు. రైతులు దిల్లీకి వస్తే పుట్టి మునిగిపోతుందన్న ప్రచారం చేస్తున్నారు. శంభు పొలిమేరల్లో అయితే రైతుల మీద డ్రోన్‌ల ద్వారా బాష్ప వాయుగోళాలు ప్రయోగించారు. అంబాలా, కురుక్షేత్ర, కైథాల్, జింద్, హిసార్, ఫతేహ్ బాద్ జిల్లాల్లో ఇంటర్నెట్ సదుపాయాన్ని నిలిపి వేశారు. పెద్ద సంఖ్యలో ఫోన్ ద్వారా సంక్షిప్త సందేశాలు (ఎస్.ఎం.ఎస్.) పంపడానికి వీలు లేకుండా కట్టడి చేశారు. తాము డిజిటల్ విప్లవం తీసుకొచ్చామని జబ్బలు చరుచుకునే మోదీ ప్రభుత్వం ఆ డిజిటల్ సదుపాయాలు ప్రజలకు అందుబాటులో లేకుండా చేసింది. దీనివల్ల ఇబ్బందిపడేది ఆందోళనకు దిగిన రైతులే కాదు. మామూలు జనం కూడా. ఇంటర్నెట్ సదుపాయం లేనందువల్ల ఆర్థిక లావాదేవీలు నిర్వహించలేని దుస్థితి ఏర్పడింది. ఇలాంటి ఇబ్బందులు ఇంకా అనేకం ఉంటాయి. తొలి దశ ఉద్యమం రైతులు ఉత్తినే ప్రారంభించలేదు. వివాదాస్పద వ్యవసాయ చట్టాలను పార్లమెంటు ఆమోదించిన వెంటనే పంజాబ్ రైతులు రెండు నెలల పాటు ఆందోళన చేశారు.

ఫలితం లేకపోవడంతో పంజాబ్ రైతులతో పాటు హరియాణా, ఉత్తరప్రదేశ్‌తో సహా అనేక రాష్ట్రాల రైతులు ఈ ఉద్యమంలో భాగస్వాములయ్యారు. ఇప్పుడూ అదే పరిస్థితి. ట్రాక్టర్లు తీసుకుని రైతులు దిల్లీ చేరకుండా ఎన్ని అడ్డంకులు కల్పించినా అడ్డంకుల్ని అధిగమించి ముందుకు సాగుతున్న వారూ ఉన్నారు. కాలి నడకన దిల్లీకి పయనమైన వారూ ఉన్నారు. వివిధ మార్గాల ద్వారా దిల్లీ చేరాలన్న పట్టుదల కనబరుస్తున్న వారిని నిలవరించడానికి మెట్రో రైళు, బస్సులు, ఇతర మార్గాల ద్వారా వచ్చే వారిని బలవంతంగా ఆ వాహనాల నుంచి దించేస్తున్నారు.

2021 జనవరిలో వివాదాస్పద వ్యవసాయ చట్టాల అమలును సుప్రీంకోర్టు నిలిపివేసిన అంశాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాలి. మొదటి దశ రైతు ఉద్యమం జరిగినప్పుడు ప్రభుత్వం ఇది విదేశీ కుట్రగా చిత్రించడంతో పాటు వారిని ఖాలిస్థానీలు అని కసిగా నిందించింది. రైతుల ఉద్యమం ఎప్పుడైనా శాంతియుతంగానే జరుగుతోంది. అయినా తొలి విడత ఉద్యమంలో 700 మంది రైతులు ప్రాణాలు పోగొట్టుకోవలసి వచ్చింది. రైతుల మీద మోపిన కేసులను ఎత్తి వేయనేలేదు. రైతుల డిమాండ్లలో ప్రధానమైంది కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడం. ఈ అంశంపై మోదీ సర్కారు పెదవే విప్పడం లేదు. ఆహార ధాన్యాల ఉత్పత్తిలో మనం స్వయం సమృద్ధంగానే ఉండొచ్చు. కొన్ని రకాల ధాన్యాలను ఎగుమతి చేస్తున్నాం. కానీ పేదల ఆకలి మాత్రం తీరడం లేదు. రైతుల సమస్యలకు పరిష్కారం కనిపించడం లేదు. అంతర్జాతీయ ఆకలి సూచికలో మొత్తం 116 దేశాలు ఉంటే అందులో మన దేశానిది 101వ స్థానం. దీన్ని చూసైనా మోదీ ప్రభుత్వం సిగ్గు పడడం లేదు. ఈ సారి కూడా రైతులు ఆకస్మికంగా ఉద్యమం ప్రారంభించలేదు. కనీసం రెండు నెలలనుంచి ఈ ఉద్యమం చేపడ్తామని చెప్తూనే ఉన్నారు. రైతులు ఆందోళనకు దిగడంవల్ల ఓట్లు పోతాయన్న భయం ఎన్నికలనే సర్వస్వంగా భావించే మోదీని తీవ్రంగా పీడిస్తోంది. ఉద్యమం అంటే ఉలిక్కి పడే మోదీ ప్రభుత్వం అసలు వారు దిల్లీకి చేరుకోక ముందే దమనకాండకు దిగడం దిగజారుడుతనానికే నిదర్శనం. తమ పౌరుల మీదే యుద్ధం ప్రకటించడం ఈ ప్రభుత్వానికి అలవాటై పోయింది.

డబ్బు ముట్టితే జబ్బులు వస్తాయా!

ఆదిమానవుడు తనకు అవసరమైన సరుకులు "వస్తు మార్పిడి" పద్ధతి ద్వారా సమకూర్చుకునే వాడు. కాలక్రమంలో నరుడు తన సౌలభ్యం కోసమంటూ కొన్ని వేల సంత్సరాలుగా కరెన్సీ నోట్లు, నాణాలను ప్రవేశపెట్టి వ్యాపార లావాదేవీలు కొనసాగిస్తున్నాడు. మానవుడి జీవితంలో కరెన్సీ అతి ప్రధాన భాగమైంది. అనునిత్యం కరెన్సీని వాడకుండా ఉండలేని పరిస్థితి వచ్చింది. కరెన్సీ నిత్యం చేతులు మారడం అనివార్యమైంది. ప్రపంచ దేశాల్లో అన్ని వర్గాల ప్రజలు కరెన్సీ నోట్లను, నాణాలను తమ తమ స్థాయిలను బట్టి వినియోగిస్తున్నారు. అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాలన్నింటిలో కరెన్సీ కాలుష్యం తీవ్ర ప్రమాదంగా మారుతోంది. ముఖ్యంగా అధిక జనాభాగల భారత్‌తో పాటు ఇతర పేద దేశాల్లో దీని ప్రతికూల ప్రభావం ఎక్కువగా ఉంది. కరెన్సీ నోట్లను పేపర్, కాటన్ లేదా ప్లాస్టిక్‌లతో తయారుచేస్తున్నారు. నాణాలు మిశ్రమ లోహాలతో తయారవుతాయి. కరెన్సీ వివిధ వర్గాల ప్రజల చేతులు మారినపుడు ఒకరి నుంచి మరొకరికి వ్యాధికారక సూక్ష్మజీవులు చేరే అవకాశం ఉంది. అపరిశుభ్ర వాతావరణం, చేపల మార్కెట్, మటన్ చికెన్ మార్కెట్, దుమ్ము దూళిలో పనిచేసే వారు, రోడ్ల వెంట అమ్మకాలు జరిపే దుకాణాదారులు, ఆసుపత్రి పరిసరాలు, మునిసిపాలిటీ కార్మికులు మొదలగు వారి చేతుల మీదుగా కరెన్సీ మారితే, హానికారక సూక్ష్మజీవులు వ్యాపించి అనేక అనారోగ్యాలకు కారణం కావచ్చనేది కాదనలేని నిజం. సూక్ష్మజీవులతో కరెన్సీ కలుషితం కావటానికి కారణాలుగా దగ్గులు, తుమ్ములు, లాలాజలంతో నోట్ల లెక్కింపు, అపరిశుభ్ర ప్రదేశాల్లో పెట్టడం, అనేక రోజులు దాచి ఉంచటం, అవగాహనా లోపం లాంటి అంశాలను చెప్పవచ్చు. అపరిశుభ్రత, గాలిలో తేమ, ఉష్ణోగ్రత, అతినీలలోహిత కిరణాలు, గాలి నాణ్యత, సూక్ష్మజీవులు జీవించే కాలం లాంటివి కూడా కరెన్సీ కాలుష్యాన్ని ప్రభావితం చేస్తాయి. కొన్ని సూక్ష్మజీవులు అతిశీతల, అతి ఉష్ణోగ్రతలను కూడా తట్టుకొనుటతో సమస్య తీవ్రత రెట్టింపు అవుతోంది. కరెన్సీ కాలుష్యానికి కారణమైన సూక్ష్మజీవుల్లో వ్యాధికారక బ్యాక్టీరియా, వైరస్, ఫంగి, ఈస్ట్ మొ దలగు పరాన్నజీవులు, కొన్ని రసాయనాలు వస్తాయి. కాటన్, పేపర్ కరెన్సీ, నాణాల ద్వారా ఈ కాలుష్య వ్యాప్తి మరింత ఎక్కువగా ఉంటుంది. తక్కువ విలువగల నోట్లు, నాణాల (5-,10-, 20-, 50-, 100-) వాడకం అధికంగా ఉండటం వల్ల కరెన్సీ కాలుష్యం వేగంగా వ్యాపిస్తుంది. మార్కెట్‌లో తిరుగుతున్న కరెన్సీలో 60 నుంచి దాదాపు 100 శాతం కాలుష్యానికి గురికావటం సమస్య తీవ్రతను తెలియజేస్తోంది. వివిధ దేశాలలో జరుగుతున్న పరిశోధనల ఫలితాలను బట్టి దాదాపు 93 రకాలైన వ్యాధికారక సూక్ష్మజీవులు కరెన్సీ ద్వారా వ్యాపిస్తున్నాయని విదితమయింది. భోపాల్‌లో జరిగిన పరిశోధనల్లో 94% కరెన్సీ కలుషితమైందని రుజువైంది. కరెన్సీలోని ఈ సూక్ష్మజీవులు కొన్ని గంటలు, రోజులు, నెలలు జీవిస్తున్నందున మన ఆరోగ్యం ప్రమాదంలో చిక్కుకోబోతున్నది. ముఖ్యమైన వ్యాధికారక బ్యాక్టీరియాలో ఎంటెరోబాక్‌టీరియేసీ, వైబ్రోకలరో, బాసిల్లస్ యస్‌పి, స్టెఫైలోకోకస్ ఎస్పీ, మైకోబాక్టీరియమ్ ట్యుబర్క్యులోసి లాంటివి గుర్తించారు. ఈ వ్యాధికారక సూక్ష్మ జీవుల వ్యాప్తితో జ్వరం, ఫుడ్ పాయిజన్, మూత్ర, జీర్ణనాళ, శ్వాసకోశ, చర్మ వ్యాధులు వస్తాయి. విరోచనాలు, వాంతులు సర్వసాధారణంగా కనిపిస్తాయి. న్యుమోనియా, ఇమ్యూన్ వ్యవస్థపై ప్రభావం గమనించారు. వీటిలో కొన్ని సూక్ష్మజీవులు అంటిబయాటిక్ మందులకు కూడా లొంగకుండా నిరోధకతను కలిగి ఉన్నాయి. కరెన్సీ కాలుష్యాన్ని తగ్గించుటకు అనేక చర్యలు తీసుకోవల్సిన సమయం ఆసన్నమైందని గమనించాలి.

కరెన్సీ వాడకాన్ని తగ్గించి ఆన్‌లైన్‌లో లేదా కార్డులు వాడుతూ నగదు బదిలీ చేయడాన్ని ప్రోత్సహించాలి. పాత కరెన్సీని దఫాల వారీగా శుభ్రపరచాలి . అతిపాత నోట్లను మార్కెట్ నుంచి తొలగించాలి. కాటన్, పేపర్ నోట్లకు బదులుగా ప్లాస్టిక్ కరెన్సీని ప్రవేశపెట్టాలి. ఉగ్రవాదులు కరెన్సీని కలుషితం చేసే అవకాశాన్ని తోసిపుచ్చరాదు. కరెన్సీ ముట్టుకున్న ప్రతిసారి చేతులను సబ్బుతో శుభ్రపరచు కోవాలి. నోట్లు లెక్కించి నప్పుడు ఉమ్మి వాడరాదు. షూ, సాక్స్, కార్పెట్ లాంటి అపరిశుభ్ర ప్రదేశాల్లో కరెన్సీని దాయరాదు. నాణాలు లేదా నోట్లను నోట్లో పెట్టు కొనుట అతి ప్రమాదకరం. పిల్లలను కరెన్సీకి దూరంగా ఉంచాలి. అధిక జనాభా, పేదరికం, నిరక్షరాస్యత ఎక్కువగా ఉన్న మన దేశంలో కరెన్సీ కాలుష్యం మరో ప్రమాదంగా మారక పూర్వమే మేల్కొని తగు చర్యలు తీసుకుంటూ అభివృద్ధి పథంలో పయనించేందుకు అందరిలో అవగాహన కలిగిస్తూ ముందుకు సాగుదాం.

దా: బుర్ర మధుసూదన్ రెడ్డి
ఫోన్: 99497 00037

గవర్నర్ల వికృతపోకడ

ఎం.మురళీకృష్ణ

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ప్రారంభ సందర్భంగా ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలోని గవర్నర్లు వికృతంగా వ్యవహరిస్తున్నారు. ఆయా రాష్ట్రాల అసెంబ్లీలను మాత్రమే కాకుండా. రాజ్యాంగాన్ని కూడా అవమానించే విధంగా వారి ప్రవర్తన ఉంటోంది. కేంద్ర ప్రభుత్వ ఏజెంట్‌లా వ్యవహరిస్తూ జగడాలమారిగా పేరొందిన వీరి వికృత పోకడలు అంతకంతకూ శ్రుతి మించుతున్నాయి. కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తూ గత కొన్ని సంవత్సరాలుగా వీరు రాష్ట్ర ప్రభుత్వాలను, ముఖ్యమంత్రులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. అసెంబ్లీ ఆమోదించిన బిల్లులకు ఆమోదం తెలపకుండా ఏళ్ల తరబడి తమ వద్దే ఉంచుకుంటున్న తీరును దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సైతం తప్పుపట్టింది. అయినా వారు తమ ఏహ్యాకరమైన చర్యలను ఏమాత్రం మార్చుకోలేదు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వ విధానాలను తెలియచేస్తూ శాసనసభల్లో సాగాల్సిన ప్రసంగాన్ని బాధ్యతారాహిత్యమైన, అసమర్థమైన రీతిలో రాజకీయం చేయడం ద్వారా కేరళ, తమిళనాడు రాష్ట్ర గవర్నర్లు తమ స్థాయికి తగినట్లు కాకుండా దిగజారి వ్యవహరించారు. రాజ్యాంగ విధుల పట్ల నిర్లక్ష్యంగా, పట్టీపట్టని రీతిలో వారి తీరువుంది.

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల మొదటి రోజున సభ్యులను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించడం ఆనవాయితీ. సోమవారం తమిళనాడు అసెంబ్లీ సమావేశాల నుంచి గవర్నర్ ఆర్ఎన్ రవి అర్ధంతరంగా లేచి వెళ్లిపోయారు. కేంద్రాన్ని విమర్శించేలా తమిళనాడు ప్రభుత్వం సిద్ధం చేసిన ప్రసంగాన్ని చదివేందుకు ఆయన తిరస్కరించారు. మధ్యలోనే ప్రసంగాన్ని ఆపివేసి, జాతీయ గీతాన్ని ఆలపించేవరకు కూడా వేచి చూడకుండానే సభ నుంచి వెళ్లిపోయారు. సీఎం ఎంకే స్టాలిన్ నేతృత్వంలోని తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వాన్ని గవర్నర్ ఆర్ఎన్ రవి మొదటి నుంచి తీవ్ర ఇబ్బందులలో పెడుతున్నారు. ఈ వ్యవహారం సుప్రీంకోర్టు వరకు వెళ్లిన విషయం తెలిసిందే. కేరళ శాసనసభను ఉద్దేశించి గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ జనవరి 25న చేసిన ప్రసంగం కేవలం రెండు నిమిషాలకే ముగిసింది. ప్రసంగ పాఠంలో చివరి పేరాను మాత్రమే చదివి ఆయన సభ నుంచి నిష్క్రమించారు. కేరళలోని వామపక్ష ప్రభుత్వంతో గవర్నర్ తరచూ కయ్యానికి కాలు దువ్వుతున్న విషయం తెలిసిందే.

సోమవారం తమిళనాడు అసెంబ్లీలో గవర్నర్ తొలుత తమిళంలో మాట్లాడుతూ అందరికీ ఆహ్వానం పలికిన తర్వాత తనకు కేటాయించిన కుర్చీలో మౌనంగా కూర్చుండిపోయారు. దీంతో గవర్నర్ తరపున ఈ ప్రసంగం తమిళ తర్జుమా పాఠాన్ని స్పీకర్ అప్పావు సభకు వినిపించారు. ఇది ముగియగానే 2024 సంవత్సరానికి అసెంబ్లీ సమావేశాల ప్రారంభోత్సవ ప్రసంగం చేయడం తన గౌరవంగా భావిస్తున్నానని వ్యాఖ్యానిస్తూ కేవలం నాలుగు నిమిషాల పాటు మాత్రమే గవర్నర్ మాట్లాడి సభ నుంచి హఠాత్తుగా బయటకు వెళ్లి పోయారు. జాతీయ గీతం ఆలపించేందుకు ముందుగానే గవర్నర్ సభ నుంచి వెళ్లి పోవడం వివాదానికి దారి తీసింది. తనను చదవమని డీఎంకే ప్రభుత్వం ఇచ్చిన ప్రసంగంలో కొన్ని పేరాలతో తాను ఏకీభవించలేనని, అటువంటి ప్రసంగాన్ని తాను చదివినట్లైతే రాజ్యాంగాన్ని అపహాస్యం చేసినట్లవుతుందని సుద్దులు పలికారు. అందువల్లే ఈ సభా గౌరవాన్ని దృష్టిలో వుంచుకుని తాను ప్రసంగాన్ని ముగిస్తున్నానని చెప్పారు. ప్రజల ప్రయోజనాల కోసం, వారి మంచి కోసం ఈ సభలో ఆరోగ్యకరమైన చర్చ జరగాలని కోరుకుంటున్నా అంటూ ఆయన సభ నుంచి బయటకు వెళ్లిపోయారు. గత ఏడాది అసెంబ్లీలో ప్రభుత్వ ప్రసంగాన్ని పక్కన పెట్టి, అందులో కొత్త అంశాలను గవర్నర్ చేర్చడం రచ్చకెక్కింది. ఇలాంటి పరిస్థితి ఈ ఏడాది పునరావృతం కాకుండా ముందుగానే గవర్నర్‌కు ప్రసంగంలోని అంశాలను ప్రభుత్వం పంపించింది. దీంతో కొత్త ఏడాదిలో తొలి సమావేశం వివాదాలకు ఆస్కారం లేకుండా గవర్నర్ ప్రసంగంతో ప్రారంభమవుతుందని అందరూ ఆశించారు. వారి ఆశలను అడియాశలు చేస్తూ గవర్నర్ తన ధోరణి మార్చుకోకుండా సభ నుంచి వాకౌట్ చేసినట్లుగా అర్థాంతరంగా వెళ్లి పోయి తన ఘర్షణపూరిత వైఖరిని చాటుకున్నారు. తమిళ భాషను ప్రశంసిస్తున్న గీతాన్ని సభా పారంభానికి ముందుగా ఆలపించడం, సమావేశాల ముగింపులో జాతీయ గీతాన్ని ఆలపించడం తమిళనాడులో సంప్రదాయంగా వస్తోంది. అసెంబ్లీ నిబంధనలకు విరుద్ధంగా జాతీయ గీతం ముందుగా ఆలపించాలని గవర్నర్ తనను కోరినట్లు, నిబంధనలు మార్చలేమని తాను స్పష్టం చేశానని స్పీకర్ అప్పావు వివరించారు. ప్రసంగం చదవకుండా గవర్నర్ మౌనంగా కూర్చోవడం శోచనీయమని, అసెంబ్లీని, ప్రజాస్వామ్యాన్ని అగౌరవ పరిచే విధంగా నిబంధనలకు విరుద్ధంగా ఆయన నడుచుకున్నారని అన్నారు. గవర్నర్ వెళ్లిపోవడంతో ఆ తర్వాత ఆ ప్రసంగాన్ని స్పీకర్ చదివి వినిపించారు. బీజేపీ ఎమ్మెల్యేలతో సహా పాలక, ప్రతిపక్ష సభ్యులందరూ సమావేశం ముగిసేవరకు సభలోనే వున్నారు. రాష్ట్రంలో మత సామరస్యతను పరిరక్షించాలన్నది తమ ప్రభుత్వ లక్ష్యమని, దానికే కట్టుబడి వున్నామని తమిళనాడు ప్రభుత్వం స్పష్టం చేసింది. సీఏఏను అమలు చేసే ప్రసక్తే లేదని ఖరాఖండిగా తెలిపింది. 2021 నుంచి ఆలస్యమవుతూ వస్తున్న జాతీయ జన గణనతో పాటూ కుల గణన కూడా చేపట్టాల్సిందిగా ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీలో గవర్నర్ వ్యవహరించిన తీరును బీజేపీ వెనుకేసుకురావడం విచారకరం. ఆయన హుందాగా వ్యవహరించా రని, నిబంధనలకు అనుగుణంగానే సభలో కూర్చున్నారని బీజేపీ శాసన సభా పక్ష నేత నయనార్ నాగేంద్రన్ సమర్థించడాన్ని ప్రజాస్వామ్య హితేషులు తప్పుపడుతున్నారు. స్పీకర్ సభలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడమే కాకుండా, కొన్ని అనుచిత వ్యాఖ్యలు చేయడంతో సభ నుంచి హఠాత్తుగా గవర్నర్ బయటకు వెళ్లి పోయారని అభాండాలు వేశారు.

గత నెలలో జరిగిన కేరళ శాసనసభ సమావేశాలలో ఆ రాష్ట్ర గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ సరిగ్గా ఇదే తరహా ధోరణి ప్రదర్శించారు. జనవరి 25వ తేదీ ఉదయం తొమ్మిది గంటలకు ఆయన సభలో ప్రవేశించగా ముఖ్యమంత్రి పినరయి విజయన్, స్పీకర్ ఏఎన్ షంశీర్ పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. గవర్నర్ కనీస మర్యాద పాటించలేదు. ముఖ్యమంత్రితో కనీసం కరచాలనం చేయలేదు. పుష్పగుచ్ఛాన్ని సైతం స్వీకరించలేదు. సభలో జాతీయ గీతాన్ని ఆలపించిన తర్వాత గవర్నర్ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. పదిహేనవ శాసనసభ పదవ సమావేశాలను ఉద్దేశించి ప్రసంగించడం గౌరవంగా భావిస్తున్నానని చెబుతూ 61 పేజీల ప్రసంగ పాఠాన్ని చకచకా తిప్పేసి, చివరి పేరా మాత్రం చదివి ముగించారు. జాతీయ గీతాలాపన జరిగిన తర్వాత 9.04 గంటలకు సభ నుంచి వెళ్లిపోయారు. అంటే ఆయన సభలో ఉన్నది కేవలం నాలుగు నిమిషాలు మాత్రమే. రాష్ట్ర చరిత్రలో గవర్నర్ ప్రసంగం ఇలా పూర్తికావడం ఇదే మొదటిసారి. గవర్నర్ సభను అగౌరపరిచే విధంగా వ్యవహరించినా ముఖ్య మంత్రి పినరయి విజయన్ హుందాగా వ్యవహరించారు. గవర్నర్ చర్యపై విజయన్ ఎలాంటి వ్యాఖ్య చేయలేదు. గవర్నర్ చర్య శాసనసభను అవమానించడమే అవుతుందని ప్రతిపక్ష నాయకులు విమర్శించారు. ఆయన ఈ చర్య ద్వారా శాసనసభా పద్ధతులను, రాజ్యాంగ ఆదేశిక సూత్రాలను ఉల్లం ఘించారని విమర్శించారు. దేశ అత్యున్నత న్యాయస్థానం ఎన్ని రకాలుగా చివాట్లు పెట్టినా, ప్రతిపక్షాలు ఎన్ని ఆందోళనలు చేసినా, బీజేపీ ఏజెంట్లుగా వ్యవహరిస్తున్న ఈ గవర్నర్లు తమ తీరుమార్చుకోకపోవడం అత్యంత విచారకరం.

తిరోగమనంలో తయారీ రంగం

బి లలితానందప్రసాద్

కొంతకాలంగా మన దేశంలో 'ఆత్మ నిర్భర భారత్', మేక్ ఇన్ ఇండియా', 'స్టార్టప్' పేర్లతో భారీ ఎత్తున తయారీ రంగంపై దృష్టి కేంద్రీకరించినట్లు కనిపిస్తోంది. కానీ వాస్తవంలో అది 'ఎక్కడ వేసిన గొంగడి అక్కడే' అన్నట్లు ఉంది. కొన్నిచోట్ల తిరోగమనం పట్టినట్లు కూడా కనిపిస్తోంది. ఇందుకు కారణాలు అనేకం. వాటిలో ప్రముఖంగా పరిగణించ వలసినది ఆ రంగం ఎదుర్కొంటున్నటువంటి కార్మిక సమస్య. కరోనా మహమ్మారి కాలంలో స్వగ్రామాలకు తరలి వెళ్లిన కోట్లాది కార్మికులు తిరిగి వస్తారని, అత్యంత సులువుగా తిరిగి పారిశ్రామిక ఉత్పత్తి పూర్వ స్థాయిని అందుకుంటుందని అంతా ఎంతగానో ఆశించారు. తద్వారా ఒక పెద్ద పారిశ్రామిక దేశంగా ఆవిర్భవించాలని కోరుకున్నాం. ఆశలన్నీ అంతకంతకు నిరాశలు అయ్యే పరిస్థితులు దాపురించాయి. ప్రభుత్వ గణాంకాల ప్రకారం 2017- 18 నుంచి 2022- 23 మధ్య తయారీ రంగపు శ్రామిక శక్తి 12.1 శాతం నుంచి 11.4 శాతానికి పడిపోయింది. దీన్నిబట్టి కరోనాకు ముందే ఈ మార్పు ప్రారంభమైనట్లు అర్థమవుతోంది. అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీ వారి అధ్యయనం ప్రకారం 1994లో ఒక కోటి రూపాయలు కుటుంబ సంస్థలు పెట్టుబడి పెడితే లభించిన ఉద్యోగాలు 33 కాగా, అవి 2015 నాటికి 8 కి దిగజారాయి. సంఘటిత రంగంలో కూడా కుటుంబ నిర్వహణ సంస్థలలో అప్పుడు కోటి రూపాయల పెట్టుబడికి 4615 ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభించగా అవి 2017 నాటికి 702కి తగ్గిపోయాయి. దీని ప్రభావం పారిశ్రామిక రంగంపై అపారంగా చూపింది. వారికి కావలసిన కార్మికులు లభించడం లేదు. కార్మికుల కొరతతో పారిశ్రామికరంగంలో వారంతా కొట్టుమిట్టాడుతున్నారు. 'ఇది గ్రహణం పట్టడం లాంటిది. మిలియన్ల కొలది కార్మికులు వెనక్కి వ్యవసాయానికి మరలి పోతున్నారు' అని ఆర్థికవేత్త (డెవలప్మెంట్) సంతోష్ మల్హోత్రా అన్నారు. మన దేశం జీడీపీ వృద్ధిలో అనేక పెద్ద దేశాలను అధిగమిస్తుందని అనేక మంది ఆర్థిక వేత్తలు అంచనా వేశారు. మన దేశం140 కోట్ల పైగా జనాభాతో చైనాని మించింది. తలసరి ఆదాయం మాత్రం 2004 డాలర్లతో మన పొరుగున ఉన్న కేవలం అర్ధ శతాబ్దం క్రితమే ఏర్పడ్డ బంగ్లాదేశ్ కన్నా తక్కువ. చైనాలో అసంఖ్యాకంగా శ్రామికులు ఫ్యాక్టరీలకు తరలి వెళ్లారు. అది అక్కడ వారి జీవన ప్రమాణాల మెరుగుదలకు అన్ని విధాల తోడ్పడింది. దీనికి బదులు ఇక్కడ అపరిపక్వముగా పారిశ్రామికీకరణ దిశగా పయనిస్తున్నట్లు కనిపిస్తోంది. ఈ కారణంగా మన దేశం అధిక జనాభా వల్ల కలిగే ప్రయోజనం పొందలేకపోతోంది. కోట్లాది ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని మన ప్రధాని అనేక సార్లు వాగ్దానాలు చేశారు. పన్నుల ఎగవేతను అరికట్టాలని, అందుకు తగిన చర్యలను చేపడతారని కొందరు ఆశించారు. కానీ అవి ఏమీ జరగడంలేదని వారు ఇప్పుడు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

వ్యవసాయ క్షేత్రాల్లో పనిచేసేవారి క్షీణత 2005 నుంచి ప్రారంభమైంది. అది చివరికి 2019 తొలినాటికి 200 మిలియన్లకు చేరింది. ఆర్థికవేత్త మల్హోత్ర లెక్కల ప్రకారం అప్పటినుండి పెరగడం మొదలై 260 మిలియన్లు అయింది. ఈ సంఖ్య రెండు దశాబ్దాల క్రితం వ్యవసాయ కార్మికులు అత్యధికంగా గల సంఖ్యకు పెద్ద దూరంలోలేదు. వారిలో అనేకులు కూలీలుగా కాక తమ సొంత కమతాల్లో పనిచేసేవారు. ఇదే కాలంలో పట్టణాలు, బస్తీలలో ఉపాధికి అవకాశాలు దాదాపు 9 మిలియన్లు తగ్గిపోయాయి. ఇక్కడ గమనించవలసింది ఈ గ్రామీణ ఉపాధి పెంచే ప్రయత్నాలు పెరుగుదల అంతా ఒక పక్క ప్రధాని కార్పొరేట్ రంగానికి ఉదారంగా బిలియన్ల కొలది రాయితీలు ఇవ్వడం ప్రారంభించిన అప్పటినుండి అనేది కీలక అంశం. ప్రస్తుత బడ్జెట్లో కూడా కార్పొరేట్ టాక్స్ 30 నుండి 22 శాతానికి తగ్గించారు. అందుకు వారు చెప్పే వివరణ, చైనా అమెరికా సంబంధాలలో ఘర్షణల కారణంగా చైనా నుంచి ఇక్కడికి పరిశ్రమలు తరలి వస్తాయనేది. అయితే ఆర్థికవేత్తలు చెప్పేది భిన్నం కావడం విశేషం. వారి ప్రకారం ఈ ప్రభుత్వ రాయితీలు అన్ని ఎలక్ట్రానిక్స్, ఫార్మా కంపెనీలు మాత్రమే ఎక్కువగా ఉపయోగించుకుంటున్నాయని. వాటిలో ఉపాధి అవకాశాలు మెరుగుపరిచే పరిస్థితులు అంతంత మాత్రమేనని. ఈ కారణాలతో ప్రపంచ బ్యాంకు ప్రకారం మన జీడీపీలో తయారీ రంగం వాటా రెండు దశాబ్దాల క్రితం 17 శాతం

కాగా ఇప్పుడు అది 13 శాతానికి దిగజారింది

తయారీ రంగం ఉపాధి అవకాశాల వెనుకబాటు గమనించదగినది. ఒక పక్క కేంద్ర బ్యాంకు ఈ మార్చితో ముగిసే ఆర్థిక సంవత్సరం జీడీపీ ఏడు శాతం అంటున్నా అందుకు ఐటీ, ఆర్థిక సేవా సంస్థలు కారణంగా మాత్రమే. అవి ఉద్యోగ అవకాశాలు అంతగాపెంచేవి కానటువంటివి. 'ఈ వృద్ధి అనేది వచ్చింది ఉద్యోగ ఉపాధి అవకాశాల పరంగా కల్పించే రంగాల నుంచి కాదు. ఇంతవరకు ఉత్పాదక వృద్ధి ద్వారా ఆశించినంతగా ఉపాధి వృద్ధి జరగలేదు' అని అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీ, బెంగళూరుకు చెందిన ఆర్థిక శాఖలో ఆచార్యులైన అమిత్ బాసు అన్నారు. ప్రపంచ బ్యాంక్ నివేదికల ప్రకారం మన తయారీ రంగం జీడీపీ వాటా రెండు దశాబ్దాల నాటి 17 శాతం నుంచి 2022లో 13 శాతానికి దిగజారింది. ఇది మన ఆర్థిక యానం ఏ దిశగా ఉన్నది సూచిస్తోంది. తాత్కాలిక బడ్జెట్లో వ్యవసాయ రంగానికి కేటాయింపులు కేవలం 1.2 లక్షల కోట్లు మాత్రమే. మొత్తం ప్రతిపాదిత బడ్జెట్ 47.66 కోట్లు కాగా అందులో వ్యవసాయానికి ఇచ్చింది కేవలం 2.4 శాతానికి పడిపోయింది. అదే దామాషాలో వ్యవసాయానికి మొత్తం బడ్జెట్లో ఉండాల్సిన వాటా శాతం తగ్గింది. ఇది 2022- 23 సంవత్సరం 4.26 శాతం ఉంటే అది ఇప్పుడు దాదాపు సగానికి తగ్గింది. రక్షణ రంగానికి ఈ బడ్జెట్లో 6.2 లక్షల కోట్లు కేటాయించారు. ఇది మన ప్రాధాన్యత క్రమాలకు అద్దం పడుతుంది. మొదటిది మనందరికీ వేళకు ఇంత అన్నం పెట్టి ఆకలి తీరుస్తుంది. మన అస్తిత్వాన్ని నిలుపుతుంది. రెండవది అవసరమే. కానీ దానికి ఎంత కేటాయించినా ఎక్కడ ఏ దేశానికి పూర్తి గ్యారెంటీ ఉండదు. అందునా అణ్వాయుధాల నిల్వలు ఆయా దేశాల్లో గుట్టలు గుట్టలుగా పేరుకొని ఉన్న ప్రస్తుత తరుణంలో. పోటాపోటీగా వీటిని పెంచుకుంటూ పోయే కన్నా ప్రపంచ శాంతి, మానవాళి శ్రేయస్సు దృష్ట్యా ప్రతి దేశం అన్ని దేశాలతో సత్సంబంధాలు ఏర్పరచుకొని విశ్వశాంతికి నిరంతరం సమిష్టిగా కృషి చేస్తే అందరికి మంచిది.

ఇక అభివృద్ధి చెందిన దేశాల ఆర్థిక వ్యవస్థ పరిణామ క్రమం పరిశీలిస్తే అవి తొలుత వ్యవసాయం నుంచి పారిశ్రామికరణ దిశగా ఎదిగి సేవా రంగానికి విస్తరించాయి. తద్వారా అక్కడ వివిధ రూపాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగాయి. దానితో సహజంగానే అక్కడి ప్రజల కొనుగోలు శక్తి, జీవన ప్రమాణాలు గణనీయంగా మెరుగుపడ్డాయి. ఒక నమూనాగా మిగిలాయి. పైన పేర్కొన్న రీతిలో కాకుండా ఇక్కడ మనకు దీనికి విరుద్ధంగా పయనించడం ఎంతైనా శోచనీయం. వాటి ఫలితాలు కూడా తదనుగుణంగానే ఉండటానికి ఆస్కారం ఉందని ఆలోచనాపరులు ఆందోళన చెందుతున్నారు. పైపెచ్చు అసలే యాంత్రీకరణతో వ్యవసాయ కార్మికులు పరిస్థితి దుర్భరంగా ఉంది. వారికి పులి మీద పుట్రలా పట్టణాల నుంచి తిరిగి వచ్చిన వారికి అక్కడ ఉపాధి అవకాశాలు దుర్లభంగా మారతాయి. నివాస సదుపాయాలు ఆయా కుటుంబాలలో ఒత్తిడిని పెంచుతాయి. వెరసి వారి కష్టాలు ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతాయి. సంపన్న ఆర్థిక వ్యవస్థలకు గల దేశాలకు అతీతంగా మన దేశం తిరిగి బయలుదేరిన చోటుకే వస్తుండటం ఆశ్చర్యకరం. విచారకరం.

'ఇండియా'ను గెలిపిస్తే ఎంఎస్‌పీపై చట్టం

కాంగ్రెస్ అధ్యక్షుడు ఖడ్గే ప్రకటన

న్యూఢిల్లీ: పండించే పంటకు కనీస మద్దతు ధర ఇవ్వాలంటూ రైతుల చిరకాల డిమాండ్‌పై కాంగ్రెస్ పార్టీ కీలక నిర్ణయం ప్రకటించింది. లోక్‌సభ ఎన్నికల్లో 'ఇండియా' కూటమిని గెలిపిస్తే రైతులు పండించే వివిధ పంటలకు కనీస మద్దతు ధర ఇచ్చేలా ఒక చట్టాన్ని తీసుకువస్తామని ప్రకటించింది. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే, సీనియర్ నేత రాహుల్ గాంధీ ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన చేశారు. దేశ ఆర్థికాభివృద్ధిలో రైతుల పాత్ర కీలకమని, అన్నదాతల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని మల్లికార్జున ఖడ్గే తెలిపారు. వివిధ పంటలకు కనీసమద్దతు ధర ఇచ్చేలా చట్టం తీసుకురావాలంటూ రైతులు మరోసారి పెద్ద ఎత్తున ఛలో ఢిల్లీ పేరుతో హస్తినలో ఆందోళనకు దిగిన నేపథ్యంలో ఖడ్గే తాజా ప్రకటన చేశారు.

రైతు సోదరులకు చారిత్రక దినం: రాహుల్

రైతన్నలకు ఈ రోజు చారిత్రక దినమని రాహుల్ గాంధీ 'ఎక్స్' ఖాతాలో పేర్కొన్నారు. స్వామినాథన్ కమిషన్ ప్రకారం ప్రతి రైతుకి కనీస మద్దతు ధరపై చట్టబద్ధమైన గ్యారెంటీ ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకున్నట్టు ఆయన తెలిపారు. రైతుల అభ్యుదయానికి దోహదపడే ఈ చట్టబద్ధత వల్ల 15 కోట్ల రైతు కుటుంబాల జీవితాల్లో మార్పులు వస్తాయన్నారు. కాంగ్రెస్ న్యాయ్ (జస్టిస్) మార్గంలో ఇది తొలి గ్యారెంటీ అని ఆయన చెప్పారు.

ఇదేనా అమృత కాలం

దేశ రాజధాని ఢిల్లీ సరిహద్దుల్లో నిరసన తెలుపుతున్న రైతులపై బాష్పవాయువు ప్రయోగించడాన్ని ప్రతిపక్షాలు తీవ్రంగా తప్పుపట్టాయి. అంబాలా సమీపంలోని శంభు సరిహద్దు వద్ద ఢిల్లీకి వెళ్లేందుకు అడ్డుగా ఉన్న బారికేడ్లను తొలగించేందుకు ప్రయత్నించిన రైతులపై పోలీసులు బాష్పవాయువు ప్రయోగించారు. ఈ ఘటనపై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పందించారు. రైతులపై జరిగిన ఈ క్రూరమైన దాడిని ఖండిస్తున్నట్లు తెలిపారు. బీజేపీ నేతృత్వంలోని వికసిత్ భారత్ ఇదేనని ఎద్దేవా చేశారు. రైతుల నిరసనను అణిచివేసేందుకు ప్రయత్నించకుండా వారి సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఘటనను సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ తీవ్రంగా ఖండించారు.

బీజేపీ పాలనలోని అమృతకాల్‌లో జరుగుతున్న సంఘటనలు ఇవేనన్నారు. రైతుల ర్యాలీని అడ్డుకునేందుకు బాష్పవాయువు ఉపయోగించడం, బారికేడ్లు ఉంచడం వంటివి సరికాదదని, రైతుల గొంతు నొక్కేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని తీవ్రంగా విమర్శించారు.

రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని, పంట రేటు, ఎంఎస్‌పీ అమలు చేస్తామని మాట ఇచ్చిన కేంద్రం... దానిని నిలుపుకోవడంలో విఫలమైందని మండిపడ్డారు. ప్రముఖ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్, మాజీ ప్రధాని చౌదరి చరణ్ సింగ్‌లకు భారతరత్న ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, అయితే... స్వామినాథన్ ఫార్ములా అమలు చేయాలన్న రైతుల డిమాండ్‌ను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ఎంఎస్‌పీ అనేది మోదీ సెల్లింగ్ ప్రైస్ కాదని, ఎంఎస్పీ అనేది కనీస మద్దతు ధర అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. కాగా... పంట ఉత్పత్తులకు కనీస మద్దతు ధర సాధించే లక్ష్యంతో మంత్రులతో జరిపిన చర్చలు విఫలమయ్యాయి. దీంతో పంజాబ్, హరియాణాకు చెందిన రైతు సంఘాలు దేశ రాజధానిలో నిరసనలకు పిలుపునిచ్చాయి. ఆందోళనల కారణంగా ఢిల్లీలో భద్రతను కట్టుదిట్టం చేశారు.

రైతు ఒంటరి కాదు: తికైత్

న్యూఢిల్లీ: పంజాబ్ రైతుల ఢిల్లీ ఛలో నిరసనకు ఉత్తరప్రదేశ్‌కు చెందిన బీకేయూ అధ్యక్షుడు రాకేశ్ తికైత్ మద్దతు ప్రకటించారు. దేశంలో అనేక రైతుసంఘాలు ఉన్నాయి. భిన్నమైన సమస్యలపై అవి పోరాటం చేస్తున్నాయి. ఢిల్లీ ఛలో పాదయాత్ర చేపడుతున్న రైతులకు ప్రభుత్వం ఇబ్బందులు కలిగిస్తే... వారివెంట మేము ఉంటాం. వారు ఎన్నటికీ ఒంటరి కాదని మోదీ ప్రభుత్వానికి హెచ్చరిక జారీచేశారు. నల్ల చట్టాలకు వ్యతిరేకంగా 2020/21 సంవత్సరాల్లో చేపట్టిన నిరవధిక ఆందోళనల్లో పాల్గొన్న కీలక నేతల్లో రాకేశ్ తికైత్ ఒకరు. రైతుల డిమాండ్లపై ఫిబ్రవరి 16న భారత్ బంద్‌కు తికైత్ పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. కనీస మద్దతు ధరలపై చట్టపరమైన హామీ డిమాండ్‌ను పరిష్కరించకుంటే... నల్ల చట్టాలకు వ్యతిరేకంగా చేపట్టిన ఆందోళనల కంటే పెద్దస్థాయిలో ఆందోళన చేపడతామని గతంలో హెచ్చరించారు. రైతులతో చర్చలు జరపాలని బీకేయూ జాతీయ అధ్యక్షుడు నరేశ్ తికైత్ ప్రభుత్వాన్ని కోరారు. దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయని, ప్రభుత్వం చర్చలు జరపాలని, రైతులకు గౌరవం ఇవ్వాలని, ఈ సమస్యను సామరస్యంగా పరిష్కరించేందుకు కేంద్రం యత్నించాలని అన్నారు.

అన్నదాతను జైల్లో పెట్టడం సరికాదు: ఆప్

న్యూఢిల్లీ: రైతుల 'ఢిల్లీ చలో' మార్చ్‌కు ఆమ్ ఆద్మీ పార్టీ మద్దతు తెలిపింది. అలాగే బవానా స్టేడియంను జైలుగా మార్చాలన్న కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనను తిరస్కరించింది. అన్నదాతని జైల్లో పెట్టడం సరికాదని పేర్కొంది. ఢిల్లీలోని బవానా స్టేడియంను జైలుగా మార్చాలన్న కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనను తోసిపుచ్చినట్లు ఆప్ ఓ ప్రకటనలో వెల్లడించింది. ఫిబ్రవరి 13న రైతుల ర్యాలీ సందర్భంగా ముందస్తుగా నిర్బంధించిన నిరసనకారుల కోసం బవానా స్టేడియంను తాత్కాలిక జైలుగా మార్చాలని సోమవారం ఢిల్లీ ప్రభుత్వానికి కేంద్రం లేఖ రాసింది. దీనికి ఆప్ ప్రభుత్వం బదులిస్తూ... రైతుల డిమాండ్లు న్యాయబద్ధమైనవని, శాంతియుత ప్రదర్శన రాజ్యాంగంలో ప్రతి పౌరుడి హక్కు అని ఆప్ పేర్కొంది. రైతులే ఈ దేశానికి అన్నదాతలు, అన్నదాతను జైల్లో పెట్టడం సరికాదని స్పష్టం చేసింది.

సుదీర్ఘ నిరసన తప్పదు

ఆరు నెలలకు సరిపడా ఆహారం, డీజిల్: రైతులు

న్యూఢిల్లీ: మోదీ సర్కారుతో తాడో పేడో తేల్చుకోవడానికి అన్నదాతలు సన్నద్ధమయ్యారు. డిమాండ్లు నెరవేరుస్తారా...ఢిల్లీలోనే మకాం వేయమంటారా అని నిలదీస్తున్నారు. తమ డిమాండ్లు నెరవేర్చుకునే లక్ష్యంతో దేశ రాజధాని ఢిల్లీ దిశగా అన్నదాతలు కదిలారు. ఈ ఉదయం పంజాబ్, హరియాణా నుంచి వేలాదిమంది రైతులు ట్రాక్టర్లతో నగరానికి బయల్దేరారు. ఈ క్రమంలో కొన్ని కీలక విషయాలు వెల్లడయ్యాయి ఇటీవల వెలుగులోకి వచ్చిన నిఘా నివేదిక ప్రకారం... ఒక్క పంజాబ్ నుంచే వందల సంఖ్యలో ట్రాక్టర్లు, వాహనాలు బయల్దేరతాయని, వాటిలో అన్నదాతలు ఆరు నెలలకు సరిపడా ఆహారం, ఇతర సామగ్రి తీసుకువస్తారని తెలిపింది. కొందరు రైతులు మీడియాతో మాట్లాడుతూ ఇదే విషయాన్ని వెల్లడించారు. ప్రభుత్వం, పోలీసులు తమ సహనానికి పరీక్ష పెట్టినా డిమాండ్లు నెరవేరేవరకు నిరసన కొనసాగిస్తామన్నారు. 'సుత్తి, రాళ్లు పగలకొట్టే పరికరాలు సహా కావాల్సినవన్నీ తమట్రాలీల్లో ఉన్నాయన్నారు. ఆరు నెలలకు సరిపడా రేషన్, డీజిల్‌తో తాము తమ ప్రాంతాల నుంచి బయలుదేరామని ఓ రైతు మీడియాకు వెల్లడించారు. ఆయన రెండు ట్రాలీల్లో సామగ్రి తీసుకొని పంజాబ్‌లోని గురుదాస్‌పూర్ నుంచి దేశ రాజధానికి వస్తున్నారు. తమ యాత్రను భగ్నం చేసేందుకు ట్రాక్టర్లకు డీజిల్ దొరక్కుండా చేస్తున్నారని రైతులు ఆరోపించారు. 2020-21లో ఉద్యమించిన రైతులు కొంతమంది ప్రస్తుత ఆందోళనలోనూ పాల్గొంటున్నారు. అప్పట్లో వారు కొన్ని నెలల పాటు ఢిల్లీలో చలిని సైతం లెక్క చేయకుండా నిరసన చేపట్టారు. హామీ ఇచ్చినట్టుగా కేంద్రం తమ డిమాండ్లు నెరవేర్చలేదని, ఇప్పుడు వాటిని సాధించుకున్నాకే తిరిగి వెనక్కివెళతామని వారు స్పష్టంచేశారు. ఇదిలా ఉంటే..'ఢిల్లీ చలో' ఆందోళన ఎలా చేపట్టాలన్న దానిపై రైతు సంఘాలు రిహార్సల్ నిర్వహించాయని, కొందరు రైతులు ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, వ్యవసాయశాఖ మంత్రి అర్జున్ ముండా సహా కొంతమంది బీజేపీ సీనియర్ నేతల ఇళ్ల ముందు నిరసన చేపట్టే అవకాశాలున్నాయని ఆ నిఘా నివేదిక పేర్కొన్న సంగతి తెలిసిందే.

ఆందోళనకు దిగిన రైతులపై చర్యలు

సీజేఐకి సుప్రీం బార్ అసోసియేషన్ లేఖ

న్యూఢిల్లీ: ప్రజల దైనందిన జీవితానికి భంగం కలిగించే ఉద్దేశంతో ఢిల్లీలోకి బలవంతంగా ప్రవేశించేందుకు ప్రయత్నించడం ద్వారా తప్పు చేసిన రైతులపై చర్య తీసుకోవాలని సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ (ఎస్‌సీబీఏ) మంగళవారం భారత ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్‌ను అభ్యర్థించింది. కేంద్రంతో చర్చలు విఫలమైన నేపథ్యంలో పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) దక్కేలా చట్టపరమైన భరోసా సహా తమ డిమాండ్లపై ఒత్తిడి చేయడానికి పంజాబ్, హరియాణ నుంచి రైతులు తమ 'ఢిల్లీ చలో' మార్చ్‌ను ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఆందోళన చేస్తున్న రైతులు అంబాలా-శంభు, ఖనౌరీ-జింద్ , దబ్వాలి సరిహద్దుల నుండి ఢిల్లీలో ప్రవేశించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. దీనిపై ఎస్‌సీబీఏ అధ్యక్షుడు ఆదిష్ సి అగర్వాలా లేఖ రాస్తూ... ఢిల్లీ సరిహద్దుల్లో రైతుల ఆందోళన కారణంగా న్యాయవాదులు హాజరయ్యే పరిస్థితి లేనందున రాకపోకలకు అడ్డంకులు తొలగిపోయేవరకు తమ ముందు జాబితా చేయబడిన ఏ విషయంలోనూ కోర్టులు ఎటువంటి ప్రతికూల ఆదేశాలు జారీ చేయకుండా అవసరమైన సూచనలు జారీ చేయాలని సీజేఐని కోరారు. 'ప్రజల దైనందిన జీవితానికి భంగం కలిగించేందుకు ఢిల్లీలోకి బలవంతంగా ప్రవేశించడానికి ప్రయత్నించినందుకు తప్పు చేసిన రైతులపై సుమోటోగా చర్య తీసుకోవాలని నేను కోరుతున్నాను' అని అగర్వాలా లేఖలో పేర్కొన్నారు. ఆందోళన చేస్తున్న రైతుల డిమాండ్లు వాస్తవమైనవే అయినా, సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేసే హక్కు వారికి లేదని ఆయన పేర్కొన్నారు. 'సుప్రీంకోర్టు స్వయంచాలకంగా వ్యవహరించి రైతులు ఎటువంటి ఇబ్బందిని సృష్టించకుండా, సాధారణ ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలిగించకుండా చూసుకోవాల్సిన సరైన సమయం ఇదే' అని ఆయన అన్నారు.

రైతన్నల ప్రధాన డిమాండ్లు ఇవే...

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ రైతులు 'ఢిల్లీ చలో' పేరుతో భారీ స్థాయిలో ఆందోళన చేపట్టారు. అయితే, వారి ప్రయత్నాలను భద్రతా బలగాలు అడ్డుకున్నాయి. సోమవారం రాత్రి రైతు సంఘాల నాయకులతో కేంద్ర మంత్రులు జరిపిన చర్చలు విఫలమయ్యాయి. దీంతో మంగళవారం ఉదయం పంజాబ్, హరియాణా నుంచి పెద్దసంఖ్యలో బయల్దేరారు. ఆరు నెలలకు సరిపడా ఆహారం, ఇతర సామగ్రితో వారు దేశ రాజధానికి వస్తున్నట్లు నిఘా వర్గాలు అంచనా వేస్తున్నాయి. రైతుల డిమాండ్లలో ప్రధానమైనది... పంటకు కనీస మద్దతు ధర. మార్కెట్ ఒడుదుడుకులతో సంబంధం లేకుండా...ఎంఎస్‌పీ భరోసా కల్పిస్తూ చట్టం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. కేంద్ర మంత్రులతో జరిగిన చర్చల్లో దీనిపై ఏకాభిప్రాయం కుదరలేదు. ఎమ్ఎస్‌పీ, స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల అమలు, పంట రుణాల మాఫీకి సంబంధించి చట్టపరమైన హామీలు ఇచ్చేందుకు కమిటీ ఏర్పాటు చేస్తామని కేంద్రం తెలిపింది. ఈ ప్రతిపాదనకు రైతు సంఘాల నాయకులు విముఖత వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. 2020-21లో ఉద్యమ సమయంలో రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. నిన్న జరిగిన చర్చల్లో దీనికి కేంద్రం అంగీకరించింది. అప్పటి ఆందోళనల్లో మరణించిన రైతుల కుటుంబాలకు కేంద్రం పరిహారం అందించాలని కోరారు. దీనికి కూడా కేంద్రం ఆమోదం తెలిపింది. కానీ, వీటిపై కేంద్రం రెండేళ్లక్రితమే హామీ ఇచ్చినా... ఇప్పటికీ నెరవేర్చలేదని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివాదాస్పద విద్యుత్ చట్టం 2020ని రద్దు చేయడం. దీనివల్ల కేంద్రం విద్యుత్ రంగాన్ని ప్రైవేటుపరం చేస్తే... తమకు అందే రాయితీ కోల్పోతామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీటితోపాటు భూసేకరణ చట్టం 2013ని పునఃవ్యవస్థీకరించడం, ప్రపంచ వాణిజ్య సంస్థ నుంచి వైదొలగడం వంటి డిమాండ్లను కేంద్రం ముందుంచారు.

మంత్రి పదవికి సెంథిల్ బాలాజీ రాజీనామా

చెన్నై: తమిళనాడు మంత్రి సెంథిల్ బాలాజీ తన పదవికి రాజీనామా చేశారు. మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన ఆయన ప్రస్తుతం జైలులో ఉన్నారు. బెయిల్ కోసం ఆయన దాఖలు చేసిన పిటిషన్ మరో రెండు రోజుల్లో మద్రాస్ హైకోర్టు ముందుకు రానున్నది. ఈ నేపథ్యంలో సెంథిల్ మంత్రి పదవికి రాజీనామా చేయడం గమనార్హం. కాగా, న్యాయపరమైన చిక్కుల వల్లే బాలాజీ తన మంత్రి పదవికి రాజీనామా చేయాల్సి వచ్చినట్లు తెలుస్తున్నది. గతేడాది జూన్ 14న మనీలాండరింగ్ కేసులో బాలాజీని ఈడీ అరెస్టు చేసింది. జైలులో ఉన్నప్పటికీ బాలాజీని సీఎం స్టాలిన్ తన మంత్రివర్గంలోనే కొనసాగించారు. అయితే ఏ శాఖ కేటాయించలేదు. దీనిపై హైకోర్టు ఇటీవల అసంతృప్తి వ్యక్తం చేసింది. బాలాజీని మంత్రి పదవిలో కొనసాగించే విషయమై మరోసారి ఆలోచించాలని సీఎం స్టాలిన్‌కు కోర్టు సూచించింది. దీంతో బెయిల్ పిటిషన్ రెండోసారి హైకోర్టు ముందు విచారణకు రానున్న నేపథ్యంలో బాలాజీ మంత్రి పదవికి రాజీనామా చేశారు.

ఈసీ తీర్పుపై సుప్రీంకోర్టుకు శరద్‌పవార్

న్యూఢిల్లీ: నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ పేరు, గుర్తును అజిత్ పవార్ వర్గానికి కేటాయించడంపై ఆ పార్టీ వ్యవస్థాపకుడు, మహారాష్ట్ర సీనియర్ నేత శరద్ పవార్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈసీ నిర్ణయం రాజ్యాంగ విరుద్ధమంటూ ఆయన అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్ వేశారు. ఇదే సమయంలో అజిత్ పవార్ సైతం సుప్రీంకోర్టులో కేవియట్ వేశారు. అజిత్ పవార్ వర్గానికి ఎన్‌సీపీ పేరు, గుర్తును కేటాయిస్తూ భారత ఎన్నికల కమిషన్ ఫిబ్రవరి 6న నిర్ణయం తీసుకుంది. అజిత్ వర్గాన్నే అసలైన ఎన్‌సీపీగా గుర్తిస్తూ, పార్టీ ఎన్నికల గుర్తు 'గడియారం' వారికే కేటాయించింది. మహారాష్ట్ర నుంచి రాజ్యసభకు ఈనెలలోనే ఎన్నికలు జరుగనుండటంతో పవార్ వర్గానికి 'నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ-శరద్ చంద్ర పవార్' అనే పేరును కేటాయించింది. పార్టీ పేరు, గుర్తును ఆ పార్టీ వ్యవస్థాపకుడి చేతి నుంచి లాక్కొని ఇతరులకు అప్పగించారంటూ ఈసీ నిర్ణయంపై శరద్ పవార్ అసంతృప్తి వ్యక్తంచేశారు. 1999లో కాంగ్రెస్ పార్టీతో తెగతెంపులు చేసుకున్న పవార్ సొంతంగా ఎన్‌సీపీని ఏర్పాటు చేశారు.

ఈ 'వ్యవస్థ'తో కొందరికే లబ్ధి: రాహుల్

న్యూఢిల్లీ: దేశంలోని 'వ్యవస్థ'తో కొంతమంది మాత్రమే ప్రయోజనం పొందుతున్నారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కేంద్రంపై విమర్శలు గుప్పించారు. మిగిలిన వారంతా పన్నులు చెల్లిస్తూ, ఆకలితో చనిపోతున్నారని చెప్పారు. ఏ విషయాన్నైనా వ్యతిరేకిస్తూ గొంతెత్తితే... ఈడీ, సీబీఐ, ఐటీ దాడులు ఎదుర్కోవాల్సిందేనని అన్నారు. తన భారత్ జోడో న్యాయ యాత్రలో భాగంగా మంగళవారం ఛత్తీస్‌గఢ్‌లోని సుర్గుజా జిల్లాలోని ఉదయపూర్ ప్రాంతంలో రాహుల్ మాట్లాడారు. దేశంలో 24 గంటలూ ప్రజలకు అన్యాయం జరుగుతుంటే హింస, విద్వేషాలు వ్యాపిస్తున్నాయని అన్నారు. ప్రజలు గ్రహించలేకపోతే దోపిడీ నిరంతరం ఓ ప్రక్రియలా జరుగుతూనే ఉంటుందని హెచ్చరించారు. 'మీరు ప్రతిరోజూ దేశ నిధి నుండి ఎంత నగదు పొందుతున్నారని రోజుకు మూడుసార్లు మీకు (ప్రజలు) మీరే ప్రశ్న వేసుకోవాలి. రోజంతా పోరాటం, ప్రయత్నం తర్వాత ఎంత రాబడిపొందుతున్నారో తెలుసుకోండి. పదిరోజుల తర్వాత మిమ్మల్ని ఒక వ్యవస్థ నిర్వీర్యం చేస్తోందని, దానికి సూత్రధారుడిగా ప్రధాని మోదీ ఉన్నారని మీకు తెలుస్తుంది' అని రాహుల్ అన్నారు. వ్యవస్థ ప్రజలను ఎలా దోచుకుంటుందో ఓ చిన్న ఉదాహరణతో వివరించారు. 'ఓ వ్యక్తి మార్కెట్‌కు వెళ్లినపుడు... ముగ్గురు దొంగలు అతని వాలెట్‌ను దోచుకోవాలనుకున్నారు. మొదటి దొంగ ఆ వ్యక్తి దృష్టి మరలుస్తాడు. ఇదే విధంగా వ్యవస్థ మిమ్మల్ని తప్పుదోవ పట్టిస్తోంది. అదే సమయంలో రెండో దొంగ మీ వాలెట్ దొంగిలిస్తాడు. జీఎస్‌టీ, నోట్లరద్దు రెండూ దోచుకోవడమే. నువ్వు తిరిగి ప్రశ్నిస్తే...మూడో దొంగ నిన్ను రెండు సార్లు కొడతాడు. ఒకవేళ నువ్వు దుకాణదారుడివిగా ఉండి భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తే ఈడీ, సీబీఐ, ఐటీ దాడులతో బెదిరింపులు వస్తాయి' అని రాహుల్ చెప్పారు.

ఢిల్లీ నుంచి ఆరు లోక్‌సభ స్థానాల్లో పోటీ: ఆప్

న్యూఢిల్లీ: రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఢిల్లీ నుంచి ఏడు ఎంపీ స్థానాలకు గాను ఆరింటిలో తమ పార్టీ పోటీ చేస్తుందని ఆమ్‌ఆద్మీ పార్టీ మంగళవారం ప్రకటించింది. ఎన్నికల అవగాహనలో భాగంగా కాంగ్రెస్‌కు ఒక్క స్థానం ఇచ్చేందుకు సుముఖత చూపింది. దేశ రాజధానిలో గత ఎన్నికలలో ఆ పార్టీ పనితీరు పరిగణనలోకి తీసుకుంటే, ఇండియా కూటమిలో సీనియర్ మిత్రపక్షంగా ఉన్న కాంగ్రెస్‌కు ఒక్క సీటు నుంచి కూడా పోటీ చేసేందుకు అర్హతలేదని ఆ పార్టీ స్పష్టం చేసింది. ఆమ్ ఆద్మీ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశం తర్వాత పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థ) సందీప్ పాఠక్ మీడియాతో మాట్లాడుతూ... ఢిల్లీలో సీట్ల పంపకాల చర్చలు పునఃప్రారంభం కావడానికి తాము నెల రోజులకు పైగా ఎదురు చూస్తున్నామని, అయితే కాంగ్రెస్ నుంచి ఎటువంటి సమాచారం లేదని అన్నారు. జనవరి 8, 12 తేదీల్లో రెండు పార్టీల మధ్య మంచి వాతావరణంలో చర్చలు జరిగినప్పటికీ ఫలించలేదున్నారు. ఢిల్లీకి సంబంధించి నెల రోజులుగా సీట్ల పంపకం చర్చలు జరగకపోవడంతో, తాను బరువెక్కిన హృదయంతో మీ ముందు కూర్చున్నానని పాఠక్ అన్నారు. ఆప్ సీట్ల పంపకాల ప్రతిపాదనను ఆయన వెల్లడించారు. ఢిల్లీలోని ఏడు లోక్‌సభ స్థానాలకు గాను ఆరింటిలో పోటీ చేయాలని, ఒక దానిని కాంగ్రెస్‌కు ఆఫర్ చేయాలని యోచిస్తున్నట్లు చెప్పారు. చర్చలు జరగకుంటే రానున్న రోజుల్లో ఢిల్లీకి ఆరుగురు అభ్యర్థుల పేర్లను ప్రకటిస్తామని చెప్పారు. 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఢిల్లీలోని మొత్తం ఏడు లోక్‌సభ స్థానాలను బీజేపీ గెలుచుకుంది. 2019 లోక్‌సభ ఎన్నికలలో, ఆప్ 18.1 శాతం ఓట్లతో మూడవ స్థానాన్ని కైవసం చేసుకోగా, కాంగ్రెస్ 22.5 శాతం ఓట్లను సాధించి రెండో స్థానం పొందింది. ఏడు లోక్‌సభ స్థానాల్లో ఐదు స్థానాల్లో రెండవ స్థానంలో నిలిచింది. బీజేపీ 56.5 శాతం ఓట్లను సాధించింది.

కోటాలో మరో విద్యార్థి ఆత్మహత్య

కోటా: రాజస్థాన్‌లోని కోటాలో విద్యార్థుల వరుస ఆత్మహత్యలు కలవరపెడుతున్నాయి. ఐఐటీ జేఈఈకి సిద్ధమవుతోన్న మరో విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఆత్మహత్యల కట్టడికి చర్యలు చేపడుతున్నప్పటికీ... ఈ ఏడాదిలో ఇది నాలుగో మరణం కావడం ఆందోళన కలిగిస్తోంది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం...జార్ఖండ్‌కు చెందిన శుభ్ చౌదరీ రెండేళ్లుగా ఐఐటీ జేఈఈకి సిద్ధమవుతున్నాడు. నిన్న జేఈఈ మెయిన్ ఫలితాలు వెల్లడయ్యాయి. ఈ పరీక్షలో తన అంచనాకు తగ్గట్టుగా మార్కులు సాధించలేకపోయాడు. ఫలితాలు చూసుకున్న తర్వాత గదికి వచ్చేశాడు. మంగళవారం ఉదయం సీలింగ్‌కు ఉరేసుకొని వేలాడుతున్న అతడి మృతదేహాన్ని గుర్తించారు. పోలీసులు శుభ్ కుటుంబానికి సమాచారం ఇచ్చారు. శవపరీక్ష తర్వాత పూర్తివివరాలు తెలుస్తాయని వెల్లడించారు. వివిధ పోటీపరీక్షల కోచింగ్ సెంటర్లకు ప్రసిద్ధి చెందిన 'కోటా'కు ఇతర రాష్ట్రాల నుంచి ఎంతో మంది విద్యార్థులు వచ్చి శిక్షణ పొందుతారు. ఒత్తిడితోనే ఇలా బలవన్మరణానికి పాల్పడుతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.

కోటి ఇళ్లకు ఉచిత విద్యుత్

'సూర్య ఘర్' ప్రారంభించిన మోదీ

న్యూఢిల్లీ: సౌర విద్యుత్ వినియోగాన్ని మరింత విస్తరించి సామాన్యులపై విద్యుత్ చార్జీల భారం తగ్గించేలా బడ్జెట్‌లో ప్రకటించిన విధంగా కేంద్ర ప్రభుత్వం ఓ అడుగు ముందుకు వేసింది. కోటి ఇళ్లకు ఉచిత విద్యుత్తు అందించేందుకు వీలుగా 'పీఎం సూర్య ఘర్: ముఫ్త్ బిజ్లీ యోజన' పథకాన్ని ప్రారంభించింది. ఈ మేరకు ప్రధాని నరేంద్రమోదీ మంగళవారం ప్రకటన చేశారు. ఇందుకోసం సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరింత స్థిరమైన అభివృద్ధి, ప్రజల శ్రేయస్సు కోసం 'పీఎం సూర్య ఘర్: ముఫ్త్ బిజ్లీ యోజన' పథకాన్ని ప్రారంభిస్తున్నామని ప్రధాని మోదీ అన్నారు. రూ.75 వేల కోట్ల పెట్టుబడితో తీసుకొస్తున్న ఈ ప్రాజెక్ట్‌తో... ప్రతినెలా 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించి కోటి కుటుంబాల్లో వెలుగులు నింపాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. దీని కింద అందించే సబ్సిడీలను నేరుగా ప్రజల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని, రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థ ఏర్పాటుకు బ్యాంకుల నుంచి భారీ రాయితీపై రుణాలు పొందొచ్చని చెప్పారు. ప్రజలపై ఎలాంటి వ్యయభారం ఉండదని హామీ ఇస్తున్నామని ప్రధాని మోదీ 'ఎక్స్'లో వెల్లడించారు. క్షేత్రస్థాయిలో ఈ పథకానికి ప్రచారం తీసుకొచ్చేందుకు... పట్టణ స్థానిక సంస్థలు, పంచాయతీలకు ప్రోత్సాహకాలు అందించనున్నట్లు ప్రధాని తెలిపారు. వారు తమ పరిధిలో ఈ రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థను ప్రోత్సహించాలని సూచించారు. ఈ పథకంతో విద్యుత్ బిల్లులు తక్కువ రావడంతో పాటు ఉపాధి కల్పన జరుగుతుందని తెలిపారు. "సౌరశక్తిని, స్థిరమైన అభివృద్ధిని మరింత విస్తృతం చేద్దామని, గృహ వినియోగదారులు, ముఖ్యంగా యువత ఈ 'సూర్య ఘర్' పథకాన్ని బలోపేతం చేయాలని కోరుతున్నానన్నారు.

మన ప్రవాసులను చూస్తే గర్వంగా ఉంది

విదేశాల్లో ఉంటున్న భారత సంతతి, ప్రవాస భారతీయులపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలు కురిపించారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు వెళ్లనున్న వేళ ప్రధాని 'ఎక్స్' (ట్విటర్) వేదికగా ఎన్‌ఆర్‌ఐల సేవలను మెచ్చుకున్నారు. 'ప్రపంచ దేశాలతో భారత్ సంబంధాలను మరింత బలోపేతం చేసేలా మన ప్రవాసులు కృషి చేస్తున్నారు. అందుకు ఎంతో గర్వంగా ఉంది. సాయంత్రం 'అహ్లాన్ మోదీ' కార్యక్రమంలో వారిని కలిసేందుకు ఎదురుచూస్తున్నా. ఈ చిరస్మరణీయమైన కార్యక్రమంలో మీరూ చేరండి' అంటూ మోదీ పిలుపునిచ్చారు. అబుదాబిలో జరిగే అతి పెద్ద భారత డయాస్పోరా (ప్రవాసులు) ఈవెంట్‌గా ప్రధాని పేర్కొన్నారు.

ఎన్నికల కమిషనర్ల నియామకం...

కొత్త చట్టంపై స్టే విధింపునకు సుప్రీం తిరస్కృతి

న్యూఢిల్లీ: భారత ప్రధాన న్యాయమూర్తి లేని కమిటీ ద్వారా ప్రధాన ఎన్నికల కమిషనర్ సహా ఎన్నికల కమిషనర్లను నియమించే కొత్త చట్టంపై స్టే విధించేందుకు సుప్రీంకోర్టు మంగళవారం నిరాకరించింది. అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ అనే స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయమూర్తులు సంజీవ్ ఖన్నా, దీపాంకర్ దత్తాతో కూడిన ధర్మాసనం ఈ విషయమై కేంద్ర ప్రభుత్వానికి నోటీసు జారీ చేసింది. పెండింగ్‌లో ఉన్న ఇతర పిటిషన్‌లతో పాటు ఈ పిటిషన్‌పై ఏప్రిల్‌లో విచారణ చేసేందుకు జాబితా చేసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్‌ల (నియామకం, సేవా నిబంధనలు, పదవీకాలం) చట్టం, 2023 రాజ్యాంగ చెల్లుబాటును ఈ పిటిషన్ సవాలు చేసింది. సీఈసీ, ఈసీలను నియమించే కమిటీలో సీజేఐ ఉండాలన్న సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పుకు ఈ చట్టం విరుద్ధమని పిటిషనర్ తరపు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపించారు. ఇద్దరు ఎన్నికల కమిషనర్లు పదవీ విరమణ చేయబోతున్నారని, చట్టం అమలును నిలిపివేయకుంటే తమ అభ్యర్థన నిష్ఫలంగా మారుతుందని ఆయన అన్నారు. మధ్యంతర స్టే కోసం పట్టుబట్టారు. దీని ధర్మాసనం స్పందిస్తూ... 'క్షమించండి ఈ విషయంలో మేము మీకు మధ్యంతర ఉపశమనం ఇవ్వలేము. రాజ్యాంగ చెల్లుబాటయ్యే అంశం ఎప్పటికీ పనికిరానిది కాదు. మధ్యంతర ఉపశమనాన్ని మంజూరు చేయడానికి మా పరిమితులు మాకు తెలుసు' అని తెలిపింది. కొత్త చట్టం ఏం చెప్పిందంటే: ప్రధాన ఎన్నికల కమిషనర్ , ఇతర ఎన్నికల కమీషనర్‌లను ప్రధాన మంత్రి అధ్యక్షతన గల ఎంపిక కమిటీ సిఫార్సుపై రాష్ట్రపతి నియమిస్తారు ఈ కమిటలో లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, ప్రధానమంత్రి సిఫార్సు చేసే కేంద్ర కేబినెట్ మంత్రి సభ్యులుగా ఉంటారు.

బీజేపీకి రైతు ముప్పు

- ఎన్నికల వేళ భయాందోళన
- ఫలించని చర్చలు-దిగిరాని కేంద్రం

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల కోసం వ్యూహాలను బీజేపీ సిద్ధం చేసుకొని ప్రణాళికాబద్ధంగా ముందుకెళుతోన్న సమయంలో రైతుల ఆందోళన రూపంలో ఈ పార్టీకి ఎదురు దెబ్బ తగిలింది. ఎన్నికల సంవత్సరంలో ఉద్యమానికి రైతులు సన్నద్ధం కావడంతో అధికార పార్టీ ఇరకాటంలో పడింది. తిరిగి పరిపాలన పగ్గాలు చేపట్టే కలలను కల్లలు చేసే అవకాశం ఉండటంతో రైతుల ఉద్యమాన్ని నీరుగార్చేందుకు, వారి ఐక్యతను దెబ్బతీసేందుకు అన్ని విధాలా యత్నిస్తోంది. మరోవైపు కేంద్రంతో రైతు నాయకులు మంగళవారం జరిపిన చర్చలు విఫలమయ్యాయి. అనేక డిమాండ్లపై ఏకాభిప్రాయం కుదరలేదు. దీంతో ఢిల్లీ సరిహద్దుల వద్ద రైతులు పెద్ద ఎత్తున చేరుకోగా అక్కడ ఉద్రిక్తత నెలకొన్నది.

2020, ఆగస్టు నుంచి 2021 డిసెంబరు వరకు చరిత్రాత్మక పోరాటాన్ని రైతులు సాగించారు. కేంద్రం మెడలు వంచి వివాదాస్పద నల్ల చట్టాలను రద్దు చేయించారు. అప్పట్లో ఎంఎస్పీకి చట్టం తెస్తామని హామీ ఇవ్వడంతో వారు తమ ఉద్యమాన్ని విరమించుకున్నారు. కానీ నేటికీ ఆ హామీ నెరవేరలేదు. అనేక డిమాండ్లు పరిష్కారం కాలేదు. దీంతో సార్వత్రిక ఎన్నికల కంటే ముందుగా తమ సమస్యలను పరిష్కరించుకోవాలని రైతులు నిర్ణయించారు. మరోసారి ఉద్యమబాట పట్టారు. ఇప్పటికే దశలవారీగా ఆందోళనలు జరుగుతుండటం 13వ తేదీన ఢిల్లీ చలో ద్వారా కేంద్రంపై మరింత ఒత్తిడి పెంచాలని భావించారు. ఉద్యమ కార్యాచరణను రైతులు ముందే ప్రకటించడంతో అప్రమత్తమైన మోదీ ప్రభుత్వం రైతు సంఘాల్లో విభేదాలు తీసుకొచ్చే ప్రయత్నం చేసింది. రైతులకు దిక్సూచిగా ఉండే చౌదరి చరణ్ సింగ్, ఎంఎస్ స్వామినాథన్‌కు భారతరత్న పురస్కారాన్ని ప్రకటించింది. కానీ తాజా పరిణామాలతో ఎదురు దెబ్బ తగిలినట్లు అయ్యింది. శంభు సరిహద్దు వద్ద నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. సానుకూల వాతావరణాన్ని మార్చే సత్తా రైతులకు ఉందని గ్రహించింది. రైతుల ఉద్యమం 2.0తో బీజేపీకి కష్టాలు తప్పబోవన్న అభిప్రాయం పరిశీలకులలో ఉంది. రైతు సంఘాల మధ్య విభేదాలు రెచ్చగొట్టి లబ్ధి పొందాలనే ప్రయత్నాల్లో కేంద్రం ఉన్నది. ఢిల్లీ మార్చ్ విషయంలో భిన్నాభిప్రాయాలు తమకు కలిసివస్తాయని భావిస్తోంది. ఖాప్ పంచాయత్‌లు పూర్తిస్థాయిలో ఢిల్లీ చలోకు మద్దతు ప్రకటించకపోవడం వల్ల గతంలో వలే ఈసారి పరిస్థితులు ఉండవని భావిస్తోంది. పరిస్థితిని అదుపు చేసేందుకు అన్ని విధాలుగా యత్నిస్తున్నట్లు బీజేపీ వర్గాలు పేర్కొన్నాయి. పంజాబ్, కర్నాటక రాష్ట్రాలే తమకు ముఖ్యమని తెలిపాయి. ఎన్నికల సంవత్సరం కాబట్టి రైతులకు విపక్షాల అండగా నిలుస్తాయన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశాయి. ఎంఎస్పీకి ఒప్పుకుంటే రైతులు పింఛన్లను డిమాండ్ చేస్తారని, సామాజిక నాయకుల ద్వారా పరిస్థితిని నియంత్రించేందుకు పార్టీ నాయకత్వం యత్నిస్తోందని తెలిపాయి. గతంలో వలే చర్చల ద్వారా సమస్యను పరిష్కరించే ప్రయత్నాన్ని కేంద్రం చేస్తోంది. కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, నిత్యానంద రాయ్, అర్జున్ ముండాను రంగంలోకి దింపింది. రైతు నేతలు, కేంద్రం మధ్య చర్చలు విఫలమయ్యాయి. రైతుల ప్రధాన డిమాండ్ల పరిష్కారానికి మంత్రులు అంగీకరించలేదు. అన్ని పంటలకు ఎంఎస్పీకి చట్టబద్ధత, పింఛన్లు, రుణమాఫీ వంటివాటిపై ఏకాభిప్రాయం కుదరలేదు. దీంతో రైతులు ఢిల్లీకి కదంతొక్కారు. ఫలితంగా సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

రైతులపై కర్కశత్వం ఆక్షేపణీయం: ఏఐటీయూసీ

న్యూఢిల్లీ: ఇచ్చిన హామీల అమలు కోసం ఢిల్లీకి రావాలనుకున్న రైతులపై కేంద్ర ప్రభుత్వం దమనకాండ సాగించడం ఆక్షేపణీయమని ఏఐటీయూసీ విమర్శించింది. అన్నదాతలకు మోదీ ప్రభుత్వం వెన్నుపోటు పొడించిందని, హామీల అమలు కోసం డిమాండ్ చేస్తే కర్కశంగా వ్యవహరిస్తోందని విమర్శించింది. 'మోదీ సర్కార్ కి గ్యారెంటీ' అని కేంద్రం డప్పుకొట్టుకుంటోంది కానీ అది పూర్తిగా బూటకమని దుయ్యబట్టింది. ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వ తీరును ఖండించారు. 'తమ డిమాండ్ల సాధన కోసం రైతులు ఢిల్లీకి కదం తొక్కగా వారిని సరిహద్దుల వద్ద అడ్డుకునేందుకు భారీగా బలగాలను కేంద్రం మోహరించింది. బాష్పవాయువు, జలఫిరంగులు ప్రయోగించింది. రైతులను అడ్డుకునేందుకు సిమెంటు బ్లాకులు, పదునైన మేకులు, ముళ్ల కంచెలు, భారీ బారికేడ్లను రోడ్లను మూసివేసింది. డిమాండ్ల పరిష్కారానికి హామీతో రైతులు తమ ఉద్యమాన్ని గతంలో విరమించుకున్నారు. అప్పట్లో రాతపూర్వకంగా కేంద్రం ఇచ్చిన హామీల అమలు కోసం వారు ఇప్పుడు డిమాండ్ చేస్తున్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడకపోగా రైతులపై కర్కశంగా దాడులు జరిపిస్తుండటం ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదు' అని పేర్కొన్నారు. కేంద్ర కార్మిక సంఘాలతో కలిసి సంయుక్త కిసాన్ మోర్చాకు అండగా నిలుస్తామని, ఈనెల 16న గ్రామీణ బంద్ జయప్రదానికి పిలుపునిచ్చారు. బీజేపీ హటావో, దేశ్ బచావో నినాదంతో జనసమీకరణ ద్వారా గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెలు విజయవంతం చేస్తామని అమర్‌జీత్ కౌర్ ప్రకటించారు.

వైసీపీ రెబల్స్‌కి మళ్లీ నోటీసులు

రేపు ఉదయం 11 గంటలకు హాజరు కావాలని లేఖ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రెబల్ ఎమ్మెల్యేలకు మరోసారి స్పీకర్ తమ్మినేని సీతారాం నోటీసులు పంపించారు. ఈ నెల 15వ తేదీ ఉదయం 11 గంటలకు స్పీకర్ ఎదుట హాజరు కావాలని రెబల్ ఎమ్మెల్యేలు ఉండవల్లి శ్రీదేవి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్ రెడ్డిలకు అసెంబ్లీ అధికారులు లేఖ రాశారు. అంతకుముందు ఈ నెల 12వ తేదీన రావాలని కోరగా, అనారోగ్య కారణాలతో హాజరు కాలేకపోతున్నామని స్పీకర్‌కు వైసీపీ రెబల్ ఎమ్మెల్యేలు లేఖ పంపించారు. దాంతో మంగళవారం) మళ్లీ రెబల్ ఎమ్మెల్యేలకు 15వ తేదీన స్పీకర్ వద్దకు రావాలని అధికారులు నోటీసులో పేర్కొన్నారు.

ఏపీ హైకోర్టు శాశ్వత జడ్జిలుగా లక్ష్మీ నరసింహ, మల్లికార్జున రావు

13 మంది నియామకాలకు సుప్రీం కొలీజియం సిఫార్సు

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు శాశ్వత జడ్జిలుగా జస్టిస్ వరాహ లక్ష్మీ నరసింహ చక్రవర్తి, జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జున రావు పేర్లను సుప్రీం కొలీజియం సిఫార్సు చేసింది. మంగళవారం సమావేశమై మూడు హైకోర్టులకు చెందిన 13 మంది అదనపు న్యాయమూర్తుల పేర్లను శాశ్వత న్యాయమూర్తులుగా నియమించేందుకు సిఫార్సు చేసింది. అలాగే మధ్యప్రదేశ్ హైకోర్టు శాశ్వత జడ్జిగా అదనపు న్యాయమూర్తి దుప్పాలా వెంకట రమణ పేరును సూచించింది. ముగ్గురు అదనపు జడ్జిలను శాశ్వత న్యాయమూర్తులుగా నియమించేందుకు 2023, ఫిబ్రవరి 24న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కొలీజియం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. రాష్ట్ర ముఖ్యమంత్రి, గవర్నర్ కూడా కొలీజియం సిఫార్సులతో ఏకీభవించారు. మరోవైపు పంజాబ్, హరియాణా హైకోర్టుకు చెందిన 10 మంది అదనపు జడ్జిలను శాశ్వత న్యాయమూర్తులుగా నియమించేందుకు సుప్రీం కొలీజియం సిఫార్సు చేసింది. వీరిలో జస్టిస్ కుల్దీప్ తివారీ, జస్టిస్ గుబీర్ సింగ్, జస్టిస్ దీపక్ గుప్తా, జస్టిస్ అమర్‌జోత్ భట్టి, జస్టిస్ రితూ ఠాకూర్, జస్టిస్ మనీశా బత్రా, జస్టిస్ హర్‌ప్రీత్ కౌర్ జీవన్, జస్టిస్ సుఖ్విందర్ కౌర్, జస్టిస్ సంజీవ్ బెర్రి, జస్టిస్ విక్రమ్ అగర్వాల్ ఉన్నారు. ఈ న్యాయమూర్తుల పేర్లను పంజాబ్, హరియాణా హైకోర్టు కొలీజియం 2023, అక్టోబరు 6న ఏకగ్రీవంగా ఆమోదించింది. ఆ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, గవర్నర్లు ఈ సిఫార్సులపై అభిప్రాయాన్ని వ్యక్తం చేయలేదు.

మేము రైతులం... దేశానికి శత్రువులం కాదు

- ఢిల్లీ చలో అణచివేత
- తూటాలు, లాఠీలతో దాడులు ఆక్షేపణీయం
- సమస్యల పరిష్కార బాధ్యతను తప్పించుకునే యత్నాల్లో కేంద్రం
- ప్రధానికి లేఖలో సంయుక్త కిసాన్ మోర్చా

న్యూఢిల్లీ: బాధిత రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన జవాబుదారీతనం నుంచి తప్పించుకోవడానికి రైతు సంఘాల మధ్య విభేదాలను ప్రముఖంగా చూపే ప్రయత్నాన్ని కేంద్రం చేస్తోందని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) విమర్శించింది. ఢిల్లీ చలోపై ఉక్కుపాదం ఆక్షేపణీయమని పేర్కొంది. మేము రైతులం... దేశానికి శత్రువులం కాదు... ఆ తరహాలో నిరసనకారులతో ప్రవర్తిస్తుండటం సరికాదు అని మంగళవారం ప్రధాని మోదీకి లేఖ రాసింది. బాధిత రైతులపై కాస్త కనికరాన్ని చూపాలని ప్రధాని మోదీని కోరింది. వవసాయంలో కార్పొరేట్ జోక్యం వల్ల రైతులు నష్టపోతుంటే కేంద్ర బడ్జెట్‌లు, శాఖల పనితీరు కూడా కార్పొరేట్లకు అనుకూలంగానే ఉంటున్నాయని ఆవేదన వ్యక్తంచేసింది. ఎస్‌కేఎం చేసిన డిమాండ్లు తక్షణమే పరిష్కరించాలని, దేశ రైతాంగ సమస్యల పరిష్కారం కోసం చర్చలు జరపాలని ప్రధానికి ఎస్‌కేఎం విజ్ఞప్తి చేసింది. సంయుక్త కిసాన్ మోర్చా నాయకులతో కాక ఇతర సంఘాల నేతలతో చర్చించడానికి మొగ్గు చూపుతూ రైతు సంఘాల మధ్య సఖ్యత లేదని చూపేందుకు కేంద్రం యత్నిస్తోందని దుయ్యబట్టింది. ఢిల్లీ చలోలో భాగంగా రైతులపై బాష్పవాయువు, లాఠీలు, రబ్బర్ బుల్లెట్లతో దాడి చేయడం, అనేక మందిని గాయపర్చడం ద్వారా సాధారణ రైతులను భయాందోళనకు గురి చేయడాన్ని ఎస్‌కేఎం ఖండించింది. ఇదే అంశమై ప్రధానికి రాసిన లేఖలో 'మీ ప్రభుత్వంతో పాటు హరియాణా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలోని బీజేపీ ప్రభుత్వాలు అణచివేతకు పూనుకున్నాయి. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న రైతులపై లాఠీలు ఝుళిపించాయి. బాష్పవాయువు, రబ్బర్ తూటాలతో గాయపర్చాయి. భయోత్పాతాన్ని సృష్టిస్తున్నాయి. ఎస్‌కేఎంతో కాక ఇతర రైతు సంఘాలతో చర్చలకు మీ మంత్రులు మొగ్గు చూపటంతో బాధిత రైతుల సమస్యలను పరిష్కరించే రాజ్యాంగబద్ధ బాధ్యత నుంచి తప్పించుకోవడానికి రైతు సంఘాల మధ్య విభేదాలకు పెద్దపీట వేయాలని మీ మంత్రులు యత్నించారు. ఢిల్లీ చలో అణచివేతకు యత్నించడం దురదృష్టకరం' అని పేర్కొంది. ఇదిలావుంటే ఈనెల 16న జరగబోయే గ్రామీణ బంద్ జయప్రదానికి పిలుపునిస్తూ వేరొక ప్రకటన వెలువరించింది. భావ సారూప్యతగల వర్గాలు కలిసి రావాలని కోరింది. వ్యవసాయ కార్మికులు, టీచర్లు, చిరు వర్తకులు, రవాణ ఉద్యోగులు, జర్నలిస్టులు, విద్యార్థులు, యువతకులు, మహిళల సంఘాల నుంచి గ్రామీణ భారత్ బంద్‌కు మద్దతు ఉన్నట్లు ఎస్‌కేఎం ప్రకటించింది.

యువజన కాంగ్రెస్ నిరసన ఉద్రిక్తం

మధ్యప్రదేశ్ అసెంబ్లీ ముట్టడికి యత్నం...అడ్డుకున్న పోలీసులు

భోపాల్: మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎదుట యువజన కాంగ్రెస్ చేపట్టిన నిరసన ఉద్రిక్తతకు దారి తీసింది. నిరుద్యోగం, హర్దా బాణసంచా కర్మాగారంలో పేలుడు, మహిళలపై దౌర్జన్యం వంటి వివిధ సమస్యలపై మంగళవారం యువజన కాంగ్రెస్ కార్యకర్తలు మధ్యప్రదేశ్ విధానసభ వెలుపల నిరసన తెలిపారు. కార్యకర్తలు బారికేడ్లు ఎక్కి విధానసభ వైపు వచ్చేందుకు ప్రయత్నించడంతో పోలీసులు వారిని చెదరగొట్టడానికి జల ఫిరంగులను ఉపయోగించారు. ఈ సందర్భంగా 40 నుంచి 50 మంది నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు కొనసాగుతున్నాయి. తొలుత మధ్యప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు జితు పట్వారీ, అసెంబ్లీలో ప్రతిపక్ష నేత ఉమంగ్ సింగర్, యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్ బీవీ, పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు విక్రాంత్ భూరియా నేతృత్వంలో నిరసనకారులు పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ రాష్ట్ర పార్టీ కార్యాలయం నుంచి విధానసభకు ర్యాలీగా చేరుకున్నారు. అయితే ఆందోళనకారులను ముందుకు వెళ్లకుండా పోలీసులు విధానసభకు వెళ్లే రహదారిపై బారికేడ్లను అడ్డుగా పెట్టారు. పట్వారీ సహా కార్యకర్తలు బారికేడ్‌లను ఎక్కేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని చెదరగొట్టడానికి వాటర్ క్యానన్‌లను ప్రయోగించారు. 40 నుంచి 50 మంది యూత్ కాంగ్రెస్ కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నట్లు అదనపు పోలీసు కమిషనర్ అవధేష్ గోస్వామి తెలిపారు. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు జలఫిరంగులను మాత్రమే ప్రయోగించారని తెలిపారు. ఫిబ్రవరి 6న హర్దా పట్టణంలోని బాణసంచా కర్మాగారంలో భారీ పేలుడు సంభవించి... మంటలు చెలరేగడంతో 12 మంది మృతి చెందగా... 200 మందికి పైగా గాయపడ్డారు.

జగన్ అక్రమాస్తులపై సుప్రీం విచారణ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అక్రమాస్తుల కేసుపై మంగళవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈకేసులో సీబీఐ, ఈడీ విచారణలు ఒకేసారి జరిగినా సీబీఐ కేసుల్లో తీర్పు ఇచ్చిన తరువాతే ఈడీ కేసుల్లో తీర్పు ఇవ్వాలని గతంలో హైకోర్టు తీర్పునిచ్చింది. దీనిని సవాల్ చేస్తూ భారతి సిమెంట్, విజయసాయిరెడ్డి, తదితరులు సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. సీబీఐ విచారణ ముగిసిన తరువాతే ఈడీ విచారణ చేపట్టాలని కోరారు. మరోవైపు హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో ఈడీ సవాల్ చేసింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ సంజీవ్ ఖన్నా ధర్మాసనం విచారణ జరిపింది. సీబీఐ కేసుల్లో తీర్పు ఇచ్చిన తరువాతే ఈడీ కేసుల్లో తీర్పు ఇవ్వాలా? లేదా? అన్న నిర్ణయాధికారం సీఆర్పీసీ సెక్షన్ 309 ప్రకారం ట్రయిల్ కోర్టుకే ఉంటుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసిన ధర్మాసనం... ఈ మేరకు ఆదేశాలు ఇస్తామని పేర్కొంది. ఈడీ తరపున సీనియర్ కౌన్సిల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. ఈ కేసుతో పాటు వేరే కేసులు కూడా ఉన్నాయని కోర్టుకు తెలిపారు. దీంతో తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేస్తున్నట్లు సుప్రీంకోర్టు వెల్లడించింది.



రైతులపై ఖాకీ క్రౌర్యాన్ని ఖండించాలి

16న గ్రామీణ బంద్ జయప్రదం చేయాలి: విద్యావేత్తల పిలుపు

న్యూఢిల్లీ: ఢిల్లీ చలోలో భాగంగా శంభు (అంబాలా) సింఘు సరిహద్దుల వద్దకు చేరుకున్న రైతులపై ఖాకీ క్రౌర్యాన్ని తీవ్రంగా ఖండించాలని, ఈనెల 16న గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని విద్యావేత్తలు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. 'దేశ రైతులు సంక్షోభంలో చిక్కుకున్నారు. పంటలకు ఎంఎస్పీలు డిమాండ్ చేస్తున్నారు. దీనికి చట్టబద్ధత కల్పించాలని కోరుతున్నారు. పంటోత్పత్తి మొత్తాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయడం తప్పనిసరి అన్నట్లు చట్టం లేదు. యూరప్‌లోని రైతులు కూడా కనీస మద్దతు ధర కోసం, మార్కెట్లు, భూములపై కార్పొరేట్ నియంత్రణకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్నారు. దేశ రైతాంగ సమస్యల పరిష్కారానికి కేంద్రప్రభుత్వం పూనుకోవాలని కోరుతున్నాం' అని ప్రకటనలో హైదరాబాద్ యూనివర్సిటీ మాజీ డీన్ డాక్టర్ నరసింహా రెడ్డి, ఢిల్లీలోని ఐసీఏఆర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ సోమా మర్ల, పర్యావరణవేత్త దొంతి నరసింహా రెడ్డి, ఉస్మానియా వర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ బీఎన్ రెడ్డి, ఉస్మానియా యూనివర్సిటీ, ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి నెల్లి సత్య, జైశంకర్ వ్యవసాయ వర్సిటీ విద్యార్థి శ్రీజా, పికాక్ పబ్లిషర్స్ ఎడిటర్ ఎ.గాంధీ, జర్నల్ ఆఫ్ ఎన్విరాన్మెంట్ సంపాదకులు డాక్టర్ నారాయణ రావు పేర్కొన్నారు. ఈనెల 16న ఎస్‌కేఎం, కేంద్ర కార్మిక సంఘాలు తలపెట్టిన గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

తేజస్వీయాదవ్‌పై పరువునష్టం దావా కొట్టివేత

న్యూఢిల్లీ: 'గుజరాతీలు మాత్రమే దొంగలు కాగలరు.' అని ఆరోపించిన రాష్ట్రీయ జనతాదళ్(ఆర్‌జేడీ) నేత తేజస్వీ యాదవ్ పై వేసిన పరువునష్టం దావాను సుప్రీంకోర్టు మంగళవారం కొట్టేసింది. ఈ కేసు విచారణను గుజరాత్ వెలుపలి కోర్టుకు బదిలీ చేయాలంటూ బీహార్ మాజీ డిప్యూటీ సీఎం వేసిన పిటిషన్‌పై జస్టిస్ ఏఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించింది. తాను చేసిన వ్యాఖ్యను ఉపసంహరించుకుంటూ యాదవ్ జనవరి 19న సుప్రీం కోర్టులో అఫిడవిట్ దాఖలు చేశారు. ఆయన అభ్యర్థనను విచారించిన అత్యున్నత న్యాయస్థానం పరువునష్టం దావాపై విచారణను నిలిపేస్తూ, కేసు దాఖలు చేసిన గుజరాత్ వాసికి నోటీసు జారీ చేసింది. అహ్మదాబాద్ కోర్టులో తనపై పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ పరువునష్టం ఫిర్యాదును ఇతర ప్రాంతాల కోర్టుకు, వీలయితే ఢిల్లీకి బదిలీ చేయాలని కోరుతూ యాదవ్ దాఖలు చేసిన పిటిషన్‌పై ఫిబ్రవరి 5న సుప్రీంకోర్టు తన ఉత్తర్వులను రిజర్వ్ చేసింది. స్థానిక వ్యాపారవేత్త, కార్యకర్త అయిన హరీష్ మెహతా యాదవ్‌పై పరువు నష్టం కేసు దాఖలు చేయడంతో గుజరాత్ కోర్టు 2023 అగస్టులో ప్రాథమిక విచారణ చేపట్టింది. ఫిర్యాదు ప్రకారం తేజస్వీ యాదవ్ 2023 మార్చిలో పట్నాలో మీడియాతో మాట్లాడుతూ "ప్రస్తుత పరిస్థితుల్లో గుజరాతీయులు మాత్రమే దొంగలు కాగలరు. ఎందుకంటే వారు చేసే మోసాలను క్షమిస్తారు. వారు బ్యాంకులకు చెల్లించాల్సిన డబ్బుతో పారిపోతే ఎవరు బాధ్యత వహిస్తారు." అని అన్నారు. ఈ వ్యాఖ్యలు గుజరాతీయులను కించపరిచేలా ఉన్నాయని మెహతా ఫిర్యాదులో పేర్కొన్నారు.

రిలయన్స్ @ రూ.20 లక్షల కోట్లు

తొలి భారత కంపెనీగా రికార్డు

ముంబై: ముకేశ్ అంబానీ నేతృత్వంలోని ప్రముఖ వ్యాపార సంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్ మరో అరుదైన మైలురాయిని చేరుకుంది. మార్కెట్ విలువ పరంగా తొలిసారి రూ.20 లక్షల కోట్లను దాటింది. ఈ రికార్డును సొంతం చేసుకున్న తొలి దేశీయ కంపెనీగా రికార్డు సృష్టించింది. 2024 ప్రారంభం నుంచి ఇప్పటి వరకు కంపెనీ షేర్లు దాదాపు 14 శాతం మేర రాణించడంతో ఈ ఘనత రిలయన్స్ సొంతమైంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు సోమవారం రూ.2,904 వద్ద ముగిసింది. మంగళవారం నాటి ట్రేడింగ్‌లో 11.16 గంటలకు 1.8 శాతం మేర లాభంతో రూ.2,953 వద్ద ట్రేడయింది. ఈ క్రమంలోనే కంపెనీ మార్కెట్ విలువ రూ.20 లక్షల కోట్లు దాటింది. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో 1.26 శాతం లాభంతో రూ.2941 వద్ద స్టాక్ ట్రేడవుతోంది. మార్కెట్ విలువ పరంగా రూ.15 లక్షల కోట్లతో టీసీఎస్ రెండో స్థానంలో ఉంది. హెచ్‌డీఎఫ్‌సీ రూ.10.5 లక్షల కోట్లు, ఐసీఐసీఐ బ్యాంక్ రూ.7 లక్షల కోట్లు, ఇన్ఫీ రూ.7 లక్షల కోట్ల మార్కెట్ విలువతో అత్యధిక విలువ కంపెనీలుగా కొనసాగుతు న్నాయి. చమురు నుంచి టెలికాం రంగం వరకు రిలయన్స్ ఇండస్ట్రీస్ వివిధ వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తోంది. 2005లో ఈ కంపెనీ తొలిసారి రూ.లక్ష కోట్ల మైలురాయిని అందుకుంది. 2007 ఏప్రిల్‌లో రూ.2 లక్షల కోట్లు, అదే ఏడాది సెప్టెంబర్‌లో రూ.3 లక్షల కోట్లు, 2017 జులై నాటికి రూ.5 లక్షల కోట్ల మార్కును అందుకుంది. 2019 నవంబర్‌లో తొలిసారి రూ.10 లక్షల కోట్ల విలువను చేరుకున్న రిలయన్స్... 2021 సెప్టెంబర్ నాటికి ఆ విలువ రూ.15 లక్షల కోట్లు దాటింది. కేవలం 600 రోజుల్లో రూ.5 లక్షల కోట్లు విలువ కూడదీసుకుని తాజాగా కొత్త మైలురాయిని చేరుకుంది. ఈ ఏడాది జనవరి 29న కంపెనీ మార్కెట్ విలువ రూ.19 లక్షల కోట్లుగా ఉంది. అంటే నెల రోజులు తిరగక ముందే రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ విలువ మరో రూ.లక్ష కోట్లు పెరిగింది.

బీజేపీ గూటికి మాజీ సీఎం అశోక్ చవాన్

ముంబై: కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అశోక్ చవాన్ బీజేపీలో చేరారు. అందరి ఊహాగానాలను నిజం చేస్తూ మంగళవారం మధ్యాహ్నం ఆయన ముంబైలోని పార్టీ కార్యాలయంలో అధికారికంగా బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ రోజు నుంచి కొత్త రాజకీయ జీవితాన్ని తాను ప్రారంభించనున్నట్లు అశోక్ వెల్లడించారు. ఈ కార్యక్రమానికి మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు చంద్రశేఖర్ బవాంకులే హాజరయ్యారు. అశోక్‌తో పాటు కాంగ్రెస్‌కు చెందిన మాజీ ఎమ్మెల్సీ అమర్‌రాజుర్కర్ కూడా కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా చవాన్ మాట్లాడుతూ... తనతోపాటు బీజేపీలో చేరమని తాను ఏ కాంగ్రెస్ నాయకులను సంప్రదించలేదన్నారు. కాంగ్రెస్‌ను వీడిన తర్వాత కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ నుంచి ఏమైనా ఫోన్ కాల్స్ వచ్చాయా అని విలేకరుల అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చేందుకు చవాన్ నిరాకరించారు. కాంగ్రెస్‌ను వీడటానికి గల సరైన కారణాలను చెప్పకుండా ఇది తన సొంత నిర్ణయమని చెప్పారు. అయితే హస్తం పార్టీని వీడి కమలం పార్టీలో చేరుతున్న నేపథ్యంలో ఆ పార్టీ నుంచి అశోక్ చవాన్‌కు రాజ్యసభ టికెట్ దక్కే అవకాశం ఉన్నట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఇటీవలే సీనియర్ నేతలు బాబా సిద్దిఖ్, మిలింద్ దేవరా సైతం కాంగ్రెస్‌ను వీడారు. కొద్దిరోజులకే అశోక్ చవాన్ కూడా ఆ పార్టీని వీడారు. నాందేడ్ జిల్లాకు చెందిన 65 ఏళ్ల అశోక్ చవాన్ మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి శంకర్రావ్‌భావ్‌రావ్ చవాన్ కుమారుడు. 2014-19 మధ్య కాలంలో రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా 2008 డిసెంబర్ నుంచి 2010 నవంబర్ వరకు పనిచేశారు. కాంగ్రెస్ తరపున భోకర్ అసెంబ్లీ స్థానానికి ప్రాతినిధ్యం వహించిన అశోక్... నాందేడ్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు.

చవాన్ చర్య ఆశ్చర్యం కలిగించలేదు: ఎన్‌సీపీ

అశోక్ చవాన్ బీజేపీలో చేరడం ఆశ్చర్యం కలిగించలేదని శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సీపీ వ్యాఖ్యానించింది. అయితే కాషాయ పార్టీతో పోరాడే శక్తి మరియు సామర్థ్యం ఉన్న కొంతమంది నాయకులు వాస్తవానికి దాని ఒత్తిళ్లకు లొంగిపోతున్నారని ఎన్‌సీపీ (శరద్‌చంద్ర పవార్) ప్రతినిధి క్లైడ్ క్రాస్టో అన్నారు. అలాంటి వ్యక్తులకు చవాన్ మరొక ఉదాహరణగా పేర్కొన్నారు. 2010లో చవాన్ ముఖ్యమంత్రి పదవిని కోల్పోవడానికి కారణమైన ఆదర్శ్ కుంభకోణాన్ని ప్రస్తావిస్తూ 'వారు దానికి లొంగిపోయి చివరికి పార్టీలో చేరారు' అని అన్నారు. అవసరమైన అనుమతులు పొందకుండానే రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన భూమిలో దక్షిణ ముంబైలోని 31 అంతస్తుల భవనాన్ని నిర్మించిన ఆదర్శ్ హౌసింగ్ సొసైటీ కుంభకోణంలో చవాన్ నిందితుడు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.